

పేర్ని నాని.. జంప్ జిలానీ..

వివాదాస్పద వ్యాఖ్యలతో రెచ్చిపోయి.. కనిపించకుండా పారిపోయి..

'కన్ను కొడితే చీకట్లో నరికెయ్యండి..' అంటూ రెచ్చిపోయిన వైసీపీ నేత పేర్ని నాని కనిపించకుండా పోయారు. 'మహా అయితే అరెస్టు చేస్తారు.. నాలుగు రోజులు జైల్లో ఉంటాను.. ఏమవుతుంది?' అని బీరాలు పలికిన మాజీమంత్రి అదృశ్యమయ్యారు. వివాదాస్పద వ్యాఖ్యలతో వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టిన ఆయనపై పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు కావటం, విచారణ జరుగుతుండటంతో తోకముడిచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అంతేకాదు.. అరెస్టు నుంచి తప్పించుకోవడానికి ముందుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

6

మచిలీపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లారా?

- వైసీపీ అధిష్ఠానం అండ ఉండటం వల్లే..
- పోలీసులు విచారణ చేపడుతుండటంతో మాయం
- అరెస్టు చేయకుండా హైకోర్టులో పిటిషన్
- బెయిల్ ఇస్తేనే బయటకు వచ్చే చాన్స్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మచిలీపట్నం క్రైమ్) : మాజీమంత్రి, వైసీపీ నేత పేర్ని నాని ఎక్కడ ఉన్నారన్నది అంతుచిక్కని ప్రశ్నగా ఉంది. బందరు నుంచి ఆయన హైదరాబాద్ వెళ్లినట్టు తెలుస్తోంది. వైసీపీ అధిష్ఠానమే పేర్ని నానీని సేఫ్ జోన్‌లో ఉంచిందన్న ప్రచారం కూడా నడుస్తోంది. హైకోర్టులో మంగళవారం పేర్ని నాని పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉండటంతో ఈలోపు పోలీసులకు చిక్కకుండా ఉండటానికి ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారని తెలుస్తోంది. వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి విచారణ, అరెస్టు నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన అగ్రనేతలు, ఎన్టీఆర్, కృష్ణాజిల్లా నేతలంతా మద్దతుగా వచ్చినా పేర్ని నాని మాత్రం ఎక్కడా కనిపించలేదు.


పేర్ని నాని

వివాదాస్పద వ్యాఖ్యల కారణంగానే..

ఇటీవల పామర్రు, అవనిగడ్డ సమావేశాల్లో వైసీపీ కార్యకర్తలు 'రప్పా రప్పా..' అని సినీ డైలాగులు చెప్పడంతో పేర్ని నాని రెచ్చిపోయారు. చీకట్లో కన్నుకొడితే చంపేయాలన్నారు. చేసే పని సైలెంట్‌గా చేయాలని, ఆ తర్వాత పరామర్శలకు వెళ్లాలని కార్యకర్తలను రెచ్చగొట్టారు. అధికారంలోకి వచ్చాక ఎవరు తప్పులు చేసినా నరికేయాలన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించటంతో పాటు నేర కార్యకలాపాలను ప్రేరేపించినట్టు అవుతుంది. దీంతో మిగతా 6లో..

తిరగతోడుతున్న పాత కేసులు

పేర్ని వ్యాఖ్యలపై టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. దీనికితోడు గుడివాడలో జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక భర్త రాముతో పేర్ని ఆడించిన నాటకం కూడా బయటపడింది. పేర్ని సతీమణి గోడౌన్‌లో రేషన్ బియ్యం దొంగతనం వ్యవహారంలో కూడా నానీని వదిలేయడంతో ఇష్టానుసారం పేట్రేగిపోతున్నాడని టీడీపీ నాయకులు భావిస్తున్నారు. దీంతో పేర్ని వ్యవహారాలపై మరిన్ని కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మచిలీపట్నంలోని జెడ్పీ కార్యాలయ ఆవరణలో టీడీపీ వేయించిన కళ్యాణమండపం శిలాఫలకాలను అప్పట్లో దుండగులు ధ్వంసం చేయగా, ఆ వ్యవహారంపైనా కేసులు పెట్టాలని చూస్తున్నారు. పేర్ని నాని ప్రోద్బలంతోనే ఈ ఘటన జరిగిందంటున్నారు. మచిలీపట్నంలో మోకా భాస్కరరావు హత్యోదంతాన్ని మంత్రి కొల్లు రవీంద్రపై నెట్టడం వెనుక కూడా కుట్ర దాగుందని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. పేర్ని నానీకి ముఖ్య అనుచరుడిగా ఉన్న మోకా భాస్కరరావు హత్యలో కూడా వైసీపీ నాయకుల ప్రమేయం ఉందనే ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. నాడు సరైన ఆధారాలు లభించలేదు. అప్పుడు అధికారం వైసీపీ చేతిలో ఉండటంతో విచారణను నీరుగార్చారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపైనా పునర్విచారణకు ఆదేశించాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. ఈ హత్యకు ప్రేరేపించిన వారు ఇంకా తప్పించుకుని తిరుగుతున్నారని, సమగ్ర విచారణ జరిపితే న్యాయం జరుగుతుందని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

నిధుల గోల్‌మాల్!

నాగాయలంక మండల పరిషత్‌లో ఓ ప్రైవేట్ ఉద్యోగి చేతివాటం

- అధికారుల లాగిన్‌తో వ్యక్తిగత ఖాతాకు పంచాయతీల నిధుల మళ్లింపు
- రూ.60 లక్షల వరకు స్వాహా చేసినట్టు అనుమానం!
- అజ్ఞాతంలోకి ఆపరేటర్.. తలలు పట్టుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు
- పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు

నాగాయలంక మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు సంబంధించిన పనులు ఆన్‌లైన్ చేసే ఓ ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్ చేతివాటం ప్రదర్శించాడు. అభివృద్ధి పనులకు సంబంధించి వారం క్రితం మంజూరైన బిల్లుల నిధులు సుమారు రూ.60 లక్షలను పంచాయతీ ఖాతాల నుంచి తన సొంత ఖాతాకు తరలించాడు. విషయం తెలిసి పంచాయతీ కార్యదర్శులు నిలదీసేందుకు ప్రయత్నించగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు గ్రామ సర్పంచ్‌లు, కాంట్రాక్టర్లు సిద్ధమవుతున్నారు.

అవనిగడ్డ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక మండలంలోని పంచాయతీ కార్యదర్శులు తమ పంచాయతీల్లో నిర్వహించే అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు పదేళ్ల క్రితం ఓ యువకుడిని అనధికారికంగా కంప్యూటర్ ఆపరేటర్‌గా మిగతా 6లో..


నాగాయలంక మండల పరిషత్ కార్యాలయం

జోరు వాన

27వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి వర్షాలు

అత్యధికంగా కంకిపాడులో 98.2 మిల్లీమీటర్లు

జిల్లా సగటు వర్షపాతం 29.6 మిల్లీ మీటర్ల నమోదు


బందరు మండలం నెలకుర్రులో నారు మడి

మచిలీపట్నం, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం 8.30 గంటల వరకు కంకిపాడులో అత్యధికంగా 98.2 మిల్లీమీటర్లు, పెడనలో అత్యల్పంగా 2.6 మిల్లీ మీటర్లు పడింది. జిల్లా సగటు వర్షపాతం 29.6 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది. నందివాడలో 92.4, గన్నవరంలో 90.2, పెనమలూరులో 56.8, ఉంగుటూరులో 48.2, ఉయ్యూరులో 44.6, గుడివాడలో 41.6, తోట్లవల్లూరులో 37.2, నాగాయలంకలో 33.2, పెదపారుపూడిలో 30.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఘంటసాలలో 27.2, పమిడిముక్కలలో 26.4, చల్లపల్లిలో 20.4, కోడూరులో 19.4, పామర్రులో 18.4, బాపులపాడులో 17.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. మిగిలిన మండలాల్లో ఒకమోస్తరు వర్షం కురిసింది. ఈ నెల 24వ తేదీన దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ఏర్పడుతుందని, దీని ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 27వ తేదీ వరకు ఒకమోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో 65 వేల హెక్టార్లలో ఇప్పటికే వరి నాట్లు పూర్తయ్యాయని, ఆయా పొలాల్లోని పైరుకు ప్రస్తుతం కురుస్తున్న వర్షం మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు. కాలువ శివారు ప్రాంతాల్లో ఇటీవల కాలంలో పోసిన వరి నారు మడులు త్వరితగతిన ఎదగడానికి ఈ వర్షం దోహదపడుతుందని రైతులు పేర్కొంటున్నారు.


పెదపారుపూడిలో నీట మునిగిన పొలాలు

కన్నీటి సాగు!

జిల్లాలో కొద్దిపాటి వర్షానికే పొంగి పొర్లుతున్న డ్రెయిన్లు

పామర్రు, పెదపారుపూడి మండలాల్లో నీట మునిగిన వరిపైరు

- మొక్కుబడిగా గుర్రపు డెక్క, నాచు, కిక్కిస తొలగింపు పనులు
- జిల్లాలో ఇప్పటి వరకు 65 వేల హెక్టార్లలో వరినాట్లు పూర్తి
- డ్రెయిన్లే ఇలా ఉంటే సాగు ఎలా అంటున్న రైతులు


బందరు మండలం చిన్నాపురం వద్ద గుండేరు డ్రెయిన్ వంతెన వద్ద తూడు

ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులకు కష్టాలు ఆరంభమయ్యాయి. ఇప్పటి వరకు సరైన వర్షాలు లేక, కాలువల ద్వారా సక్రమంగా సాగునీరు అందక వరి నాట్లు వేసిన పొలాలు నెర్రలిచ్చి పైరు ఎండిపోయే స్థితికి చేరింది. ఇటువంటి పరిస్థితుల్లో మూడు, నాలుగు రోజులుగా ఎడ తెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు పంట పొలాలను ముంచెత్తుతున్నాయి. డ్రెయిన్లలో నీటి పారుదలకు అవకాశం లేక పైరు మునిగిపోతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డ్రెయిన్లలో గుర్రపు డెక్క, నాచు, కిక్కిసలను సకాలంలో తొలగించక పోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని, నవంబరు వరకు కురిసే వర్షాలకు ఎన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందోననే భయం రైతులను వెంటాడుతోంది.

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : జిల్లాలో 1.65 లక్షల హెక్టార్లలో ఈ ఏడాది వరి పంట సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అయితే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొని రైతులు 65 వేల హెక్టార్లలో ఇప్పటి వరకు వరి నాట్లు పూర్తి చేశారు. ఇంకా లక్ష ఎకరాల్లో సాగు వేసేందుకు సమాయత్తమవుతున్నారు. గత నాలుగు రోజులుగా వాతావరణం చల్లబడి వర్షం కురుస్తుండటంతో వ్యవసాయ పనులను వేగవంతం చేశారు. శివారు ప్రాంత భూముల్లో నారు మడులు పోస్తున్నారు.

గుర్రపు డెక్క, నాచు తొలగింపు పనుల్లో ఆలస్యం!

వేసవిలోనే జిల్లాలోని ప్రధాన డ్రెయిన్‌లలో పెరిగిన గుర్రపు డెక్క, నాచు, కిక్కిలను తొలగించాలని రైతులు, శాసన సభ్యులు కోరారు. గత నెలలో జరిగిన సాగునీటి సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్ ప్రధాన డ్రెయిన్‌లలో పూడిక తీయకుంటే రైతులు పడే ఇబ్బందులను కలెక్టర్ బాలాజీ, నీటిపారుదల, డ్రైనేజీ విభాగం అధికారులకు వివరించారు. అయినా పనులు చేయకుండా కాంట్రాక్టర్‌లు నిర్లక్ష్యం ప్రదర్శించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పామర్రు మండలం కొరిమెర్ల, యలకుర్రు, నిమ్మలూరు తదితర ప్రాంతాల్లో డ్రెయిన్‌లు పొంగి ప్రవహిస్తున్నాయి. సకాలంలో పూడిక తీయకపోవడంతో కొద్దిపాటి వర్షానికే యలకుర్రు డ్రెయిన్, దానికి మిగతా 6లో..

ఆసుపత్రికి వెళ్తూ అనంతలోకాలకు..

హనుమాన్ జంక్షన్ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


ప్రమాదస్థలిని పరిశీలిస్తున్న ఎస్సై సురేశ్

హనుమాన్ జంక్షన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జంక్షన్ బైపాస్ రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. జంక్షన్ ఎస్సై వి.సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన పసలపూడి రాఘవ (30), తాడేపల్లిగూడెం మండలం కృష్ణంపాలెం గ్రామానికి చెందిన ఎల్లమిల్లి భాస్కరరావు (50) ద్విచక్ర వాహనంపై ఆసుపత్రి పనిమీద విజయవాడ వెళ్తున్నారు. శేరీనరసన్నపాలెం అడ్డరోడ్డు సమీపంలోని హోసన్న మందిరం వద్ద ఏలూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీ వీరిని ఢీకొనడంతో దుర్మరణం చెందారు. ఎస్సై వి.సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలకు గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.


వృద్ధురాలు డొక్కు నాగేశ్వరమ్మ

ఇంటి నుంచి కొడుకు తరిమేశాడు..

కుమార్తె ఇంటి వద్ద తలదాచుకుంటున్నా..

- పింఛను డబ్బులు మందులకే సరిపోతున్నాయి
- నా ఇల్లు నాకు ఇప్పించి న్యాయం చేయండి
- కలెక్టరేట్‌లో గంగూరుకు చెందిన వృద్ధురాలి వేడుకోలు

మచిలీపట్నం టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): "కన్న కొడుకు ఇంట్లో నుంచి తరిమేశాడు.. కంకిపాడు మండలం పునాదుపాడులోని పెద్ద కుమార్తె ఇంటి వద్ద తలదాచుకుంటున్నా. ప్రభుత్వం ఇచ్చే పింఛను మందులకు సరిపోవడంలేదు. నా ఇల్లు నాకు ఇప్పించి న్యాయం చేయండి" అంటూ పెనమలూరు మండలం గంగూరుకు చెందిన ఎనభై ఏళ్ల వృద్ధురాలు డొక్కు నాగేశ్వరమ్మ అధికారులను వేడుకొంది. సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్‌కు వచ్చిన ఆమె తన గోడు వెళ్లబోసుకుంది. పెద్ద కొడుకు, భర్త చనిపోయిన తర్వాత చిన్న కొడుకు గంగాధరరావు నేను ఉంటున్న ఇంట్లోకి వచ్చాడని చెప్పింది. ఆ తర్వాత నన్ను ఇంట్లో నుంచి తరిమేశాడని కన్నీరు పెట్టుకుంది. పునాదిపాడులో పెద్ద కుమార్తె కనకదుర్గ ఇంటి వద్ద బతుకు వెళ్లమారుస్తున్నానని తెలిపింది. బెంగళూరులో ఉంటున్న మనుమడు (కుమార్తె కొడుకు) నెలకు రూ.1500 పంపిస్తున్నాడని, ఆ డబ్బులు, పింఛనుతో మందులు కొనుక్కుంటున్నట్టు చెప్పింది. బలవంతంగా తన ఇంటిని లాక్కుని, తనను ఇంటి నుంచి గెంటేసిన చిన్న కొడుకుపై చట్టపరంగా చర్యలు తీసుకుని, ఇల్లు తనకు ఇప్పించాలని కోరింది. గంగూరుతో తనకు ఆరు సెంట్ల ఇళ్ల స్థలం ఉందని వివరించింది.

అంగన్వాడీల ధర్నా

మచిలీపట్నం టౌన్/అవనిగడ్డ/బంటుమిల్లి, జూలై 21 (ఆంధ్ర జ్యోతి): అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా సీడీపీవో కార్యాలయాల వద్ద అంగన్వాడీలు సోమవారం ధర్నా నిర్వహించారు. డిజిటలైజేషన్ అమలుకు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ గుర్తింపు విధానం రద్దు చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, వేధింపులను అరికట్టాలన్నారు. అనంతరం ఆయా డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను సీడీపీవోలకు అందజేశారు.


బంటుమిల్లిలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు


కడలి వైపు పరుగులు తీస్తున్న కృష్ణమ్మ

బిరబిరా కృష్ణమ్మ

- ఎగువ నుంచి కృష్ణానదికి వరద
- నాలుగు గేట్లు పైకెత్తి దిగువకు విడుదల

విజయవాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి వస్తున్న వరదతో కృష్ణానది ఎరుపెక్కుతోంది. వాగులు, పట్టిసీమ నుంచి వస్తున్న నీరు ప్రకాశం బ్యారేజీకి చేరుతోంది. కీసర నుంచి 214, వజీనేపల్లి నుంచి 1,595 క్యూసెక్కుల నీరు వస్తోంది. వెలగలేరు ద్వారా పట్టిసీమ నీరు 3,499 క్యూసెక్కులు వస్తోంది. మొత్తం ఎగువ నుంచి 5,308 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో బ్యారేజీ నాలుగు గేట్లను ఒక అడుగు మేర పైకెత్తారు. 3,625 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. మరో 3,522 క్యూసెక్కులు కాల్వలకు విడుదల చేస్తున్నారు.

డేంజర్ డేటింగ్
యువతకు వలపు ఉచ్చు బిగించి స్మార్ట్‌గా దోపిడీ
- డేటింగ్ యాప్స్‌తో భారీగా ఆర్థిక నేరాలు
- యువతీ యువకులు, ట్రాన్స్ జెండర్ల ఫొటోలు, వీడియోలతో హనీ ట్రాప్

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

ట్రైనీ ఐపీఎస్‌ల బృందం సీఆర్‌డీఏ కార్యాలయ సందర్శన
8

ఎస్సీ, ఎస్టీ, రైతులకు ఉచిత విద్యుత్
- లక్షా 91 వేల కనెక్షన్లు లక్ష్యం
- సూర్యఘర్‌పై ప్రత్యేక దృష్టి
- ఏపీసీపీడీసీఎల్ ఎండీ పుల్లారెడ్డి

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు
- 814 బైక్‌లు స్వాధీనం
6



దాత, కుటుంబసభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు, దుర్గమ్మకు కానుకగా సమర్పించిన మంగళ సూత్రాలు, చైను (కింద)

దుర్గమ్మకు మంగళసూత్రాలు, చైన్ కానుక



ఇంద్రకీలాద్రి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రామలింగేశ్వరపేటకు చెందిన జంధ్యాల కుమారస్వామి కుటుంబసభ్యులతో సోమవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు కానుకగా రెండు మంగళసూత్రాలు ఉన్న బంగారు చైను అందజేశారు. 61 గ్రాముల రూ.5 లక్షల విలువైన చైను, మంగళసూత్రాలను ఆలయ అధికారులకు అందజేశారు. వారికి అధికారులు అమ్మవారి దర్శనం కల్పించగా.. అనంతరం వేద పండితులు లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

మద్యం కుంభకోణంతో జగన్‌రెడ్డి పాపాల చిట్టా బట్టబయలైంది



» దేవినేని ఉమామహేశ్వరరావు

గొల్లపూడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మద్యం కుంభకోణంతో జగన్‌రెడ్డి పాపాల చిట్టా బట్టబయలైందని, గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం స్కామ్ దేశంలోనే అతిపెద్దదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం గొల్లపూడిలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం దేశంలోనే అతిపెద్ద స్కామ్‌గా అభివర్ణించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కంటే పదిరెట్లు ఎక్కువగా వైసీపీ మద్యం కుంభకోణం జరిగిందన్నారు. దశలవారీ మద్యం నిషేధం అని చెప్పి కమీషన్ల కక్కుర్తితో కల్తీ మద్యాన్ని ఏరులై పారించారన్నారు. కల్తీ మద్యం తాగి 30వేల మందికి పైగా మృతిచెందారని, లక్షల మంది ఆసుపత్రి పాలయ్యారని చెప్పారు. కల్తీ మద్యం సొమ్ముతో బంగారం కొనుగోలు, రియల్ ఎస్టేట్, సినిమాలు తీయడం, జింబాబ్వే, టాంజానియా, జాంబియావంటి దేశాల్లో మైనింగ్, దుబాయ్, ఆఫ్రికా దేశాలకు షెల్ కంపెనీల ద్వారా వేలకోట్లు తరలించారని అన్నీ దర్యాప్తులో బయటకు వస్తాయని ఉమా ఆరోపించారు. ఒక ప్రణాళిక, పథకం ప్రకారమే జగన్ రెడ్డి కనుసన్నల్లో కుంభకోణం జరిగిందన్నారు. వైసీపీ దోచేసిన వేలకోట్లను రికవరీ చేసి, నిందితులను అరెస్ట్ చేయాలన్నారు.



నిరుపేద కుటుంబాలతో వెనిగోళ్ల సురేష్‌కుమార్

పీ-4 పథకంలో 27 కుటుంబాలు దత్తత

పెనుగంచిప్రోలు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ పీ-4 పథకంలో భాగంగా పారామౌంట్ ఇండస్ట్రీస్ అధినేత వెనిగోళ్ల సురేష్ కుమార్ మూడు గ్రామాలకు చెందిన 27 పేద కుటుంబాలను దత్తత తీసుకున్నారు. పెనుగంచిప్రోలు మండలంలోని కొనకంచి నవాబుపేట, ముండ్లపాడు గ్రామాలకు చెందిన 27 పేద కుటుంబాలను దత్తత తీసుకున్నట్టు వెనిగోళ్ల సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దత్తత తీసుకున్న 27 కుటుంబాలకు చెందిన వారి విద్య, వైద్యం, ఆరోగ్యంతో పాటు పలు అవసరాలను నేరవేరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మూడు గ్రామ పంచాయతీల అధికారులు పాల్గొన్నారు.

ఆర్నెల్ల పాటు ఈ స్టేషన్లలో రైళ్లకు హాల్టింగ్

రైల్వేస్టేషన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే ప్రయోగాత్మకంగా ఆరునెలల పాటు పలు స్టేషన్లలో కొన్ని రైళ్లకు హాల్టింగ్ ఇస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో కె.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22691, 22692 హజరత్ నిజాముద్దీన్-కె.ఎస్ఆర్ బెంగళూరు రైళ్లకు యాద్‌గిర్‌లో హాల్టింగ్ ఇచ్చారు. బెంగళూరు నుంచి వచ్చే రైలు ఈనెల 27 నుంచి, హజరత్ నిజాముద్దీన్ నుంచి వచ్చే రైలు ఈనెల 26 నుంచి యాద్‌గిర్‌లో ఆగుతాయి. 17479 పూరి-తిరుపతి ఆగస్టు 3 నుంచి, 17481 బిలాస్‌పూర్-తిరుపతి ఆగస్టు 5 నుంచి, 17249 తిరుపతి-కాకినాడ టౌన్ ఆగస్టు2నుంచి చిన్నగంజాం స్టేషన్‌లో ఆగుతాయి. 17243 గుంటూరు-రాయగడ రైలు ఆగస్టు 2 నుంచి భీమడోలులో, 17281 గుంటూరు-నరసాపూర్ పుట్లచెరువులో ఆగస్టు 2 నుంచి ఆగుతాయి. 12522 ఎర్నాకుళం-బరోని ఆగస్టు 8 నుంచి చీరాల స్టేషన్‌లో ఆగుతుంది. 20707 సికింద్రాబాద్-విశాఖపట్నం ఆగస్టు 25 నుంచి, 20708 విశాఖపట్నం-సికింద్రాబాద్ ఆగస్టు 24 నుంచి ఏలూరు స్టేషన్‌లో ఆగుతాయి. 20833 విశాఖపట్నం - సికింద్రాబాద్, 20834 సికింద్రాబాద్-విశాఖపట్నం రైళ్లు ఆగస్టు 2 నుంచి సామర్లకోట స్టేషన్‌లో ఆగుతాయి. ఆరు నెలల పాటు ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్టు తెలిపారు.

కార్మికులకు అండగా టీయూసీసీ

» పోరాడి సాధించుకున్న చట్టాలు తొలగిస్తున్న కేంద్రం

» రాష్ట్ర అధ్యక్షుడు డీవీఎన్ రాజు

విజయవాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సంఘటిత, అసంఘటిత రంగంలో ఉన్న కోట్లాదిమంది కార్మికులకు అండగా టీయూసీసీ రాష్ట్ర అధ్యక్షుడు డి.వి.ఎన్. రాజు పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం నిర్వహించిన వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1925లో బ్రిటీషు ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రప్రభుత్వం తొలగిస్తోందని ఆరోపించారు. వందేళ్ల కార్మిక ఉద్యమ చరిత్రలో కార్మికులకు చట్టబద్ధ రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని, ప్రభుత్వాలు ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పారిశ్రామికీకరణను నిర్వీర్యం చేస్తున్నాయని వ్యాఖ్యానించారు. కార్మికులు చట్టబద్ధ రక్షణ, హక్కుల పరిరక్షణకు టీయూసీసీ కట్టుబడిఉంటుందని రాజు అన్నారు. ఈ సమావేశంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

గవర్నర్‌పేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రైడ్ ఆఫ్ ఇండియా, ఐకాన్ ఆఫ్ ఇండియా-2025 జాతీయ స్థాయి పురస్కారాల ఎంపికకు వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆల్ దిబెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈవీఎన్ఎస్ నారాయణ మాష్టారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 17న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ఎంపిక చేసిన ప్రముఖులకు పురస్కారాలు ఇచ్చి ఘనంగా సత్కరించడం జరుగుతుందని తెలిపారు. ప్రతిభ కనబర్చిన సమాజ సేవకులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, వైద్యులు, కళాకారులు, కవులు, రచయితలు, క్రీడాకారులు ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తులు కార్యాలయానికి పంపాలని కోరారు. దరఖాస్తుతో పాటు ప్రతిభను కనబర్చే ఫోటోలు, పత్రికల్లో కటింగ్స్, 4 పాస్‌పోర్టు సైజు ఫోటోలను జతచేసి పంపాలని కోరారు. వివరాలకు9652347207 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ, రైతులకు ఉచిత విద్యుత్

సెప్టెంబరు 1 నుంచి అమలు

» జిల్లాలో లక్షా 91వేలు ఫ్రీ కనెక్షన్లు

» సూర్యఘర్‌పై ప్రత్యేక దృష్టి

» సీపీడీసీఎల్ ఎండీ పుల్లారెడ్డి



21 ఎంటిఎం 06 : సమావేశంలో మాట్లాడుతున్న పుల్లారెడ్డి, హాజరైన విద్యుత్‌శాఖాధికారులు

మచిలీపట్నం టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 200లోపు యూనిట్లలోపు వినియోగించే ఎస్సీ, ఎస్టీ, రైతులకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ, చైర్మన్ పి.పుల్లారెడ్డి తెలిపారు. సోమవారం జిల్లాపరిషత్ సమావేశపు హాలులో విద్యుత్‌శాఖ డీఈలు, ఏఈలు, లైన్‌మెన్లు, ఆపరేషన్ ఫైనాన్స్ ప్రాజెక్టు అధికారులతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో ఎండీగా బాధ్యతలు స్వీకరించిన పుల్లారెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వం నూతనంగా 200 యూనిట్లకు తక్కువ వినియోగించే ఎస్సీ, ఎస్టీలకు లక్షా 91 వేలమందికి ఉచిత కనెక్షన్లు ఇస్తున్నామన్నారు. సెప్టెంబరు 1 నుంచి ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ఆక్వా రైతులకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నామన్నారు. అయితే కొందరు రైతులు విద్యుత్‌ను ఉచితంగా ఇస్తున్నా కనీసం కనెక్షన్ చార్జీలు కూడా చెల్లించడం లేదన్నారు. తమ పరిధిలో ఇప్పటికి ఏడు జిల్లాల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించామన్నారు. రెండునెలల్లో రైతులకు పెండింగ్ ఉన్న 550 కనెక్షన్లు ఇస్తామన్నారు. లో ఓల్టేజ్ సమస్య అధిగమించేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఉయ్యూరు, కొత్తవరంలలో నూతనంగా లైన్లు వేస్తున్నామన్నారు. అవసరమైనచోట 32 కేవీ 11 కేవీ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు వేస్తామన్నారు. కొత్తవరం సమస్య చాలాకాలంగా ఉందని, ఆ సమస్య 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కనెక్షన్ల ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. విద్యుత్ కొనుగోలు చేసేందుకు యూనిట్‌కు 3 రూపాయల 50 పైసలకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో సూర్యఘర్ పథకం అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. చేనేత కార్మికులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేందుకు సర్వే జరిగిందన్నారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. రొయ్యల చెరువులకు రూపాయిన్నరకే విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. విద్యుత్ చౌర్యం అరికడుతున్నామన్నారు. విద్యుత్ సరఫరాకు ఎక్కడా ఏవిధమైనా అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్ ఎస్ఈ ఎం సత్యానందం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆపరేషన్స్ డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్, ప్రాజెక్టు డైరెక్టర్ పివిఎస్ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిధుల గోల్‌మాల్!

(5వ పేజీ తరువాయి)

నియమించుకున్నారు. అతనికి పంచాయతీ కార్యదర్శులు తమ జీతం నుంచి ప్రతీ నెల ఇంత అని ముట్టచెబుతూ, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, ట్రెజరీ పనులకు వినియోగించుకుంటున్నారు. అతను మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో నిర్వహించిన అభివృద్ధి పనులకు సంబంధించి ఇటీవల బిల్లులు మంజూరు కాగా, పంచాయతీ కార్యదర్శుల లాగిన్‌లోకి వెళ్లి సదరు ఉద్యోగి ఆయా పంచాయతీ ఖాతాల్లో నుంచి తన సొంత ఖాతాకు, తనకు సంబంధించిన బంధువుల ఖాతాలకు భారీ మొత్తాలను బదలాయించుకున్నట్టు తెలిసింది. మండల పరిషత్ పాలకవర్గానికి సంబంధించి ఓ ముఖ్య నేత చేసిన పనులకు రూ.20 లక్షల మేర బిల్లులు రావాల్సి ఉంది. తాజాగా ఇటీవల ఆ బిల్లులు విడుదలయ్యాయని, సదరు మొత్తాన్ని కాంట్రాక్టర్ ఖాతాకు జమ చేయకుండా, ఆ ఉద్యోగి తన సొంత ఖాతాలకు మళ్లించుకున్నట్లుగా సమాచారం. మండలంలోని ఆరు పంచాయతీల లావాదేవీలన్నింటినీ సదరు ఉద్యోగే నిర్వహిస్తుండటంతో మొత్తం ఎంత మేర నిధులను అతను బదలాయించుకున్నాడన్న విషయమై మండల పరిషత్ ఉద్యోగులు గోప్యంగా విచారణ చేస్తున్నారు.

రేపల్లె కేంద్రంగా సాగిన వ్యవహారం

మండల పరిషత్ కార్యాలయంలో ప్రైవేట్‌గా పని చేస్తున్న సదరు కంప్యూటర్ ఆపరేటర్ రేపల్లె కేంద్రంగా నిధులు మళ్లింపునకు పాల్పడినట్లుగా తెలుస్తోంది. రేపల్లెలో సదరు ఉద్యోగి సొంతంగా కార్యాలయం ఏర్పాటు చేసుకుని సాయంత్రం సమయంలో పంచాయతీ ఉద్యోగులతో కలసి అక్కడి నుంచే తన కార్యకలాపాలు నిర్వహిస్తుండే వాడని, అయితే వారం క్రితం విడుదలైన డబ్బు కాంట్రాక్టర్ ఖాతాలకు వెళ్లకుండా సదరు ఉద్యోగి ఖాతాకు వెళ్లినట్లు ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు గుర్తించి, నిలదీసేందుకు ప్రయత్నించగా, సదరు ఉద్యోగి అదృశ్యమైనట్లు సమాచారం. సదరు ఉద్యోగి పూర్తిస్థాయిలో వ్యవహారాలు చూసే ఆరు పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లు రేపల్లె వెళ్లి అతని కార్యాలయం తలుపులు బద్దలు కొట్టి అక్కడ ఉన్న రికార్డులను జాగ్రత్తగా వెనక్కి తెచ్చుకున్నట్లు తెలిసింది. వక్కపట్లవారిపాలెం గ్రామానికి సంబంధించి రూ.2.60 లక్షలతోపాటు మరో ఐదు పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధుల బిల్లులు దారి మళ్లించటంతో కాంట్రాక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు లబోదిబో మంటున్నారు. మండ పరిషత్ పాలకవర్గానికి చెందిన రూ.20 లక్షల బిల్లులు కూడా గోల్‌మాల్ అయినట్లుగా సమాచారం. సదరు ప్రజాప్రతినిధి బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే వైసీపీ మండల నేత భోగాది వెంకట శేషగిరిరావు ఎంపీడీవో జి.సుధాప్రవీణ్‌కు ఈ నిధుల గోల్‌మాల్‌పై ఫిర్యాదు చేయగా, పంచాయతీ కార్యదర్శులు, కాంట్రాక్టర్లు కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు సుమారు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు నిధులను సదరు ప్రైవేటు ఉద్యోగి దారి మళ్లించినట్లు సమాచారం. అజ్ఞాతంలో ఉన్న ఆ ఉద్యోగి దొరికితేనే గానీ ఎంత మొత్తంలో నిధులు దారిమళ్లాయో తెలిసే అవకాశం ఉందని ఉద్యోగులు అంటున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో సుధా ప్రవీణ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా, సోమవారం మధ్యాహ్నం నుంచి ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది.



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

» 14 బైక్‌లు స్వాధీనం

గుడివాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్రాష్ట్ర బైక్ దొంగల ముఠాను అరెస్టు చేసి వారి నుంచి రూ.6.50లక్షల విలువైన 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. సోమవారం వన్‌టౌన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక ఏలూరురోడ్డులో బైక్‌లను



స్వాధీనం చేసుకున్న బైకులు

తనిఖీ చేస్తుండగా కొరడాల యేసు, చిలకంటి రంగారావులు అనుమానాస్పదంగా పారిపోయేందుకు ప్రయత్నించారని, వెంటనే పోలీసులు వెంబడించి పట్టుకున్నారన్నారు. వారిని విచారించగా ఏలూరు, గుంటూరు, ప్రకాశం, కృష్ణాజిల్లాలో 14 బైక్‌లను దొంగిలించినట్టు పేర్కొన్నారు. బైక్‌లను వేర్వేరు ప్రాంతాల్లో తాకట్టు పెట్టినట్టు తెలిపారు. ఆటో డ్రైవర్, తాపీ మేస్త్రీ ఇద్దరూ కలిసి ఆటస్థలాలు, ఆసుపత్రులు, ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను దొంగతనం చేసినట్టు విచారణలో తేలిందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు డీఎస్పీ తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన పలువురు కానిస్టేబుళ్లకు రివార్డులను అందజేశారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

నాగాయలంక, జూలై 21 (ఆంధ్రజ్యోతి) :





వెంకటేశ్వరమ్మ, సుదీప్

నంగేగడ్డ గ్రామంలోని రైసు మిల్లు ప్రాంతంలో కాలువ గట్టున ఉన్న తుమ్మ చెట్టు కొమ్మన కొండ తేనె తుట్టె ఈగలు బారిన పడి సోమవారం ఐదుగురు ఆసుపత్రి పాలయ్యారు. గ్రామానికి చెందిన బండ్రెడ్డి విచ్చేశ్వరరావు, అంది వెంకటేశ్వరమ్మ, జన్ను సుదీప్, జన్ను వెంకటేశ్వరరావు, బండ్రెడ్డి శ్రీనివాసరావు ఉదయం రహదారిపై వెళ్తుండగా, కొండ ఈగలు పైకి లేచి ఐదుగురిని వెంటపడి కుట్టాయి. బాధితులు అవనిగడ్డ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. ముఖం మీద, ఒళ్లంతా కుట్టినట్టు తెలుస్తోంది. ఆ ప్రాంతం వైపు వెళ్లాలంటే గ్రామస్థులు భయపడుతున్నారు. ఈ చెట్టును తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

కొ'న్నీటి' సాగు!

(5వ పేజీ తరువాయి)

అనుబంధంగా ఉన్న డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ గ్రామాల్లో వరినాట్లు పూర్తి చేసిన 600 ఎకరాల్లో వరిపైరు ప్రస్తుతం నీట మునిగింది. మరో నాలుగైదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో వరిపైరు చనిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెదపారుపూడి మండలం పటమట పొలంలో 200 ఎకరాలకు పైగా వరిపైరు నీటి మునిగింది. ఈ గ్రామంలోని డ్రెయిన్‌లో పూడిక తీయకపోవడంతో పొలాలు నీటమునిగాయి.



నీట మునిగిన వరిపైరు

మోపర్రు వద్ద బుడమేరుతో పాటు చంద్రయ్య కాలువ, పాలకోడు డ్రెయిన్‌లలో గుర్రపు డెక్క, నాచులను సక్రమంగా తొలగించకపోవడంతో ఈ డ్రెయిన్‌లు పొంగి ప్రవహిస్తున్నాయి. మరింతగా వర్షం పడితే వర్షపు నీరు పొలాల్లో ఉండిపోయి వరిపైరు కుళ్లి పోతుందని రైతులు వాపోతున్నారు.

గుండేరు డ్రెయిన్‌లో పేరుకున్న నాచు

ఘంటసాల, మొవ్వ, చల్లపల్లి, మచిలీపట్నం మండలాల్లోని పంట పొలాల నుంచి మురుగు నీటిని సముద్రంలో కలిపే గుండేరు డ్రెయిన్ ప్రస్తుతం పొంగి ప్రవహిస్తోంది. మచిలీపట్నం-చిన్నాపురం రహదారి వెంబడి గుండేరు డ్రెయిన్‌పై ఉన్న వంతెన వద్ద తూడు, గుర్రపు డెక్క, నాచు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. ఈ వంతెన వద్ద అర కిలోమీటరు మేర పెరిగిన తూడు తొలగించే పనులు చేయకుండా జాప్యం చేస్తున్నారు. దీంతో నాలుగు మండలాల్లో వరి నాట్లు వేసిన పొలాల్లోని వరి పైరు నీటమునిగే ప్రమాదం పొంచి ఉంది. మచిలీపట్నం మండలంలోని గుండుపాలెం గ్రామం పక్కనే ఉన్న డ్రెయిన్‌లో కిక్కిసను ఒకవైపున మాత్రమే తొలగించారు. దీంతో తొలగించిన ప్రాంతంతో పాటు డ్రెయిన్‌కు మరోవైపున ఉన్న కిక్కిస మరింతగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందని స్థానిక రైతులు చెబుతున్నారు. చల్లపల్లి మండలం మాజేరు గ్రామం సమీపంలోని లింగన్నకోడు వంతెన వద్ద, ఘంటసాల మండలం దేవరకోట తదితర ప్రాంతాల్లో గత రెండు రోజులుగా డ్రెయిన్లలో గుర్రపు డెక్కను తొలగించే పనులను చేస్తున్నారు. ఇప్పుడు పనులు చేస్తే ఎంతమేర ప్రయోజనం ఉంటుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. వర్షాలు కురిసే సమయంలో యంత్రాల ద్వారా పనులు చేయడం సాధ్యం కాని సమయంలో పనులు ప్రారంభించి మమ అనిపించే ప్రయత్నాలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.



ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ఆర్టీసీ ఆస్తులు ప్రైవేటుపరం చేస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమం : ఈయూ

విజయవాడ (బస్సుస్టేషన్), జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుపరం చేయాలని చూస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం తప్పదని ప్రజా రవాణా సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్చరించింది. విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న గవర్నర్‌పేట 2 డిపో, పాతబస్టాండ్ స్థలాలను షాపింగ్ మాల్‌కు ఇవ్వాలన్న ఆలోచనలను విరమించుకోవాలన్నారు. విద్యుత్ బస్సుల పేరుతో రెండు దశల్లో ప్రైవేట్ ఆపరేటర్లకు 19 డిపోలను అప్పగించే ప్రయత్నం విరమించుకోవాలని యూనియన్ రాష్ట్ర నాయకులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్యలు సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఇబ్బందులను పరిష్కరించి న్యాయం చేస్తుందని ఆశతో ఎదురుచూస్తుంటే ఇందుకు విరుద్ధంగా వారికి నిరాశ మిగిల్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని తెలిపారు. కొత్తబస్సుల కొనుగోలుకు ప్రభుత్వం ఆర్థికంగా సహకరిస్తు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సంస్థను విస్తరిస్తుందని, ఉద్యోగుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తారని, బకాయిలు చెల్లిస్తారని, విలీనం అనంతరం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తారనుకుంటే ఇందుకు విరుద్ధంగా నడుస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నగరాభివృద్ధి మంచిదే కానీ, ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించటం సరికాదన్నారు. పాత బస్టాండ్‌లో గవర్నరుపేట డిపోకు చెందిన 3.70 ఎకరాల స్థలాన్ని లులూ షాపింగ్ మాల్‌కు కట్టబెట్టి బస్టాండ్‌కు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న గొల్లపూడిలో ప్రత్యామ్నాయ స్థలం కేటాయించేందుకు ఆర్టీసీ యాజమాన్యంతో జరుపుతున్న చర్చలను విరమించుకోవాలని కోరారు. రెండు దశల్లో 19 డిపోలను విద్యుత్ బస్సు ఆపరేటర్లకు అప్పగించే ప్రయత్నాన్ని కూడా విరమించాలన్నారు. లేదంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ అంశాలపై ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎండీ ద్వారకా తిరుమలరావులకు వినతిపత్రాలు ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. ఉద్యోగుల పక్షాన నిలిచి ఆర్టీసీని బలోపేతం చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ చైర్మన్, ఎండీని కలిసిన వారిలో రాష్ట్ర నాయకులు ఎం.డీ ప్రసాద్, ఎం.డి.ఎ.సిద్దిక్, పి.వి.భవానీ, ఎం.శంకరరావు, మొహిద్దీన్, చక్రవర్తి, నారాయణ, వై.శ్రీనివాస్ ఉన్నారు.

రాష్ట్రాభివృద్ధికి పునాది రైతు.. చంద్రబాబుతోనే రైతు అభివృద్ధి



» నెట్టెం రఘురాం

విజయవాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధికి పునాది రైతు.. అటువంటి రైతు అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని కేడీసీసీ చైర్మన్, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సాగునీటి సమస్యల పరిష్కారం దిశగా ముఖ్యమంత్రి తీసుకుంటున్న చర్యలు దీనికి నిదర్శనమన్నారు. ముక్త్యాల లిఫ్టిరిగేషన్ ప్రాజెక్టుకు 2019 ఫిబ్రవరి 16న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారన్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ముక్త్యాల నుంచి వేదాద్రికి మార్చి ప్రాజెక్టుకు హడావుడిగా శంకుస్థాపన చేసి, తరువాత పనులు నిలిపివేసిందని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టు సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో సత్వరమే స్పందించి నిధులు విడుదల చేయడంతో తిరిగి ప్రాజెక్టు పనులు వేగమందుకున్నాయన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గంప్రాయి, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లోని 38,627 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని రఘురాం అన్నారు. దీనిద్వారా వేలాది మంది రైతులకు ఉపాధి, ఉత్పత్తి పెంపు లభిస్తుందన్నారు.

పేర్ని నాని.. జంప్ జిలానీ!

(5వ పేజీ తరువాయి)

టీడీపీ కార్యకర్తలు పలు పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టారు. అయినా వెరవకుండా పెడనలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని ఉద్దేశించి పేర్ని దారుణంగా మాట్లాడారు. తాను అనలేని మాటలను ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూనే.. తాను పగలే చేయాలని చెబుతాను కానీ, చీకట్లో చేయమని చెప్పనని కూడా అన్నారు. మచిలీపట్నం రాబర్ట్‌సన్ పేట పోలీస్ స్టేషన్‌లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి ఫిర్యాదు చేయగా, బీఎన్ఎస్ సెక్షన్లు 353(2), 196(1) ప్రకారం జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి పామర్రు పోలీసులకు కేసును బదిలీ చేశారు. పామర్రు పోలీసులు అరెస్టు చేస్తారన్న సమాచారంతో పేర్ని నాని అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో పోలీసులు పేర్ని అనుచరులు, వైసీపీ ముఖ్య నాయకుల ఇళ్లలో సోదాలు చేస్తున్నారు. కాగా, ఈ కేసులో పేర్ని హైకోర్టును ఆశ్రయించారు. తనపై రాజకీయ దురుద్దేశంతో కేసు బనాయించారని, ఆ కేసును కొట్టేయాలని పిటిషన్ వేశారు. ఈ కేసు మంగళవారం ధర్మాసనం ముందుకురానుంది.

గ్రామీణ రోడ్లపై ప్రత్యేక దృష్టి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ రోడ్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, దమ్ము చక్రాల ట్రాక్టర్లను కట్టడి చేయాలని, ఓవర్‌లోడ్ వాహనాల రాకపోకలు పూర్తిగా నిషేధించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికకు అనుగుణంగా దశలవారీ లక్ష్యాల సాధనకు కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణప్రాంతాల్లో పంచాయతీ రాజ్ రోడ్ల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీ రాజ్ ఈవో జెడ్ రమేష్, డీఈ కె.సరస్వతి, ఏఈలు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో పంటకు బలం

జీవన ఎరువులు వినియోగిస్తే 10శాతం ఎరువులను ఆదా చేయొచ్చని, అలాగే పచ్చిరొట్ట పైర్ల ఎరువులతో 25 శాతం ఆదా చేయొచ్చని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి పచ్చిరొట్ట పైర్లు, జీవన ఎరువుల ప్రయోజనాలతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లతో నేలసారం పెరుగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది అన్నదాతలకు అవగాహన కల్పించాలని, దీనికి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వినియోగించుకోవాలన్నారు. డీఆర్వో ఎం లక్ష్మీ నరసింహం, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి పాల్గొన్నారు.



పురుగు మందు డబ్బా పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ద్వారావతి దాతృత్వం ఆదర్శనీయం

మానవ సేవయే మాధవ సేవగా దాతృత్వంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ద్వారావతి ఫౌండేషన్ అందరికీ ఆదర్శనీయమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ద్వారావతి నిత్యాన్న ప్రసాద సేవ ద్వారా నాలుగేళ్లుగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు అర్జీలు సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న వారికి భోజనం అందిస్తోంది. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ అన్న ప్రసాదాన్ని ప్రజలకు పంపిణీ చేశారు. ప్రతి సోమవారం ఎక్కడెక్కడి నుంచో వచ్చే సుమారు 200 మంది ఆకలిని తీరుస్తున్న ద్వారావతి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఫౌండేషన్ చైర్మన్ జి.సంతోష్‌కుమార్, వైస్‌చైర్మన్ పి.సత్య, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

31లోగా ఫొటోగ్రఫీ ఎంట్రీలు పంపండి

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం (ఆగస్టు19) సందర్భంగా విశేష ప్రతిభ కనబరిచిన ఫొటోగ్రాఫర్లకు జిల్లాస్థాయిలో పురస్కారాలు ప్రదానం చేసేందుకు ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు ఈ నెల 31లోగా ఎంట్రీలు సమర్పించాలని కలెక్టర్ లక్ష్మీశ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విభాగం కింద జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర/స్వచ్ఛ ఎన్టీఆర్, యోగాంధ్ర అంశాలకు సంబంధించి ఎంట్రీలు పంపాలన్నారు. రెండో విభాగంలో తల్లికి వందనం/విద్య, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం-2 ఉన్నాయని, మూడో విభాగంలో అత్యుత్తమ న్యూస్ ఫొటో పోటీ ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ (రూ.10 వేలు), ద్వితీయ (రూ.7 వేలు), తృతీయ (రూ.4 వేలు) బహుమతులతో పాటు రూ.2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక బహుమతులు అందించనున్నట్టు వివరించారు. ఫొటోలు 2024 జూలై 12 నుంచి 2025 జూలై31 మధ్య తీసినవై ఉండాలన్నారు. ఒరిజినల్ ఫొటోలతో ఎంట్రీలను విజయవాడ గోపాలరెడ్డి రోడ్డులోని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం ఆవరణలోని డీపీఆర్వో కార్యాలయంలో అందచేయాలన్నారు. వివరాలకు 9121215373 నెంబర్‌లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	228
చికెన్ స్కిన్‌లెస్	238

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 510



కానూరులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ నజీర్

పారిశుధ్య పనుల పరిశీలన

కానూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిపల్ పరిధి కానూరులోని సనత్‌నగర్, అంబేడ్కర్ కాలనీ, రామాలయం ప్రాంతం, మసీద్‌సెంటర్ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ పరిశీలించారు. పారిశుధ్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. పరిశుభ్రంగా పనులు చేయాలని, సమయపాలన పాటించాలని ఆయన కోరారు.



కానూరులో డ్రెయినేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

కానూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): తాడిగడప మున్సిపాలిటీ కానూరు ప్రధాన రహదారిలో 1.20 కిలో మీటర్ల పొడవున రూ. 1.57 కోట్ల వ్యయంతో చేపట్టే డ్రెయినేజీ నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. డ్రెయినేజీ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పనులు పూర్తయ్యాక శాశ్వత ప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, పార్టీనేతలు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త లక్ష్మీప్రసన్న చొరవ

హనుమాన్‌జంక్షన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ రోడ్డులోని నాలుగు రోడ్ల కూడలిలో రహదారి డివైడరుపై ప్రమాదకరంగా ఉన్న ఇనుప రాడ్లను జనసేన పార్టీ కార్యకర్త బండారు లక్ష్మీప్రసన్న సోమవారం తొలగించారు. నాలుగు రోడ్ల కూడలిలో గుడివాడ రోడ్డు డివైడరుపై ఇనుప గ్రిల్స్ శిథిలావస్థకు చేరడంతో కొన్నేళ్ల కిందట వాటిని తొలగించారు. పూర్తిగా తొలగించకుండా రాడ్ల ముక్కల్ని డివైడరులో వదిలేశారు. దీంతో అవి రహదారిపై వెళ్లే ప్రయాణికులకు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎవరు పట్టించుకోకపోడంతో లక్ష్మీప్రసన్న వాటిని తొలగించారు. పలువురు ఆమెను అభినందించారు.



డివైడరుపై ఇనుప రాడ్లను తొలగింపజేస్తున్న లక్ష్మీప్రసన్న



ఉప్పలూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా పడవల మధుసూదనరావుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

రైతులకు మెరుగైన సేవలందించండి

● ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందించాలని ఉప్పలూరు పీఏసీఎస్ ఛైర్మన్ మధుసూదనరావుకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు. ఉప్పలూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా పడవల మధుసూదనరావు, సభ్యులుగా పరసా సురేష్, వెంగల దుర్గా భవానీతో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. టీడీపీ బలోపేతానికి పడవల మధుసూదనరావు విశేషంగా కృషి చేశారని, ఆయన సేవలను గుర్తించి ఛైర్మన్ పదవిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అప్పగించారని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజా, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ లాం సోనియ, ఉపసర్పంచ్ కలపాల కనకారావు, యార్లగడ్డ రాజా, చలసాని రాధాకృష్ణమూర్తి, లాం సురేష్, కనగాల సుబ్బారావు, జనసేన నాయకుడు తంబి, బీజేపీ నాయకుడు శనగశెట్టి సత్యప్రసాద్ పాల్గొన్నారు.



కాటూరు అంగన్వాడీ కేంద్రంలో స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశీలనలో డీఎల్పీవో సంపత్‌కుమారి, ఎంపీడీవో శేషగిరిరావు

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాల పర్యటన

ఉయ్యూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్-25 బృందాలు సోమవారం కాటూరు, బోళ్లపాడు, ముదునూరులో పర్యటించాయి. స్వచ్ఛత, పారిశుధ్య నిర్వహణపై సర్వే నిర్వహించాయి. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గమనించి పారిశుధ్య పరిస్థితులను, అధికారుల పనితీరును పర్యవేక్షించాయి. పరిశుభ్రత, మురుగునీటి వ్యవస్థ, ఇంటింటా చెత్త సేకరణ, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, మరుగుదొడ్ల నిర్మాణం, వి నియోగం, ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలు, ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాయి. డీఎల్పీవో సంపతకుమారి, ఎంపీడీవో శేషగిరిరావు, డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వ రరావు, సర్పంచ్‌లు కె.ఆశాజ్యోతి, నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు తదితరులు

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

● రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

కంకిపాడు, జులై 21(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. మండేపూడి నాగభూషణ్ భవన్‌లో సీఐటీయూ మండల కార్యదర్శి తాడంకి నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లతో విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయన్నారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయని పక్షంలో మరో విద్యుత్ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి మున్నంగి నరసింహారావు, వివిధ సంఘాల నాయకులు పోతురాజు నాగేశ్వరరావు, పాశం రవి, జి.కుమారి, వి.శివశంకర్, వి. మరియదాసు, ఎం.చంటిబాబు, యు.రమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.



గన్నవరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

కంకిపాడు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

అంగన్వాడీలకు పనిభారం తగ్గించాలి

గన్నవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు పని భారం తగ్గించాలని ఆ సంఘ నాయకురాలు కనకదుర్గ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం అంగన్వాడీలు ఆందోళన జరిపారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. గ్రామాల్లో అంగన్వాడీలు తీవ్ర పని ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. ఆరోగ్యం దెబ్బతిన్న వారికి ప్రభుత్వం నుంచి ఏ విధమైన సహకారం అందడం లేదన్నారు. పనిచేయని సెల్‌ఫోన్లు ఇవ్వడం వల్ల ఇబ్బంది పడుతున్నామని, సమాచారం అప్లోడ్ చేయడం కష్టమవుతుందని అన్నారు. నాణ్యమైన సెల్ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే టేక్ హెమ్ రేషన్(టిహెచ్ఆర్), ఇతర సేవలకు ఎస్ఆర్ఎస్ ధ్రువీకరణ తప్పనిసరి నిబంధన అమలును వెంటనే ఆపాలని సంఘ నాయకురాలు నాగలక్ష్మి డిమాండ్ చేశారు. ఖాదర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి

కంకిపాడు: పనికి తగిన వేతనం ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని శిశు సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. గత వైసీపీ హయాంలో అందజేసిన స్మార్ట్ ఫోన్లు సరిగ్గా పనిచేయడం లేదని సీఐటీయూ మండల కార్యదర్శి తాడంకి నరేష్ అన్నారు. విధి నిర్వహణలో అంగన్వాడీలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు వై.నళినీ కుమారి, సెక్టార్ లీడర్లు రమా, విజయలక్ష్మి, హస్నాబీ, కనకరత్నం పాల్గొన్నారు.

అర్హులందరికీ సూపర్‌సిక్స్ పథకాలు



ఉయ్యూర్లులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న వైవీబీ రాజేంద్రప్రసాద్

ఉయ్యూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అర్హులదరికీ సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలు అమలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. 18వ వార్డులో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గుర్నాథరావు, పార్టీ నాయకుడు అల్‌రియాజ్, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు. తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో బోళ్లపాడులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. వైసీపీకి అధికారమిస్తే ప్రజలకు మేలు చేయక పోగా వేల కోట్ల రూపాయలు స్కామ్‌లు, కుంభకోణాలు చేసిందని ఆయన ఆరోపించారు. మద్యం స్కామ్‌లో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టుచేస్తే, రాజకీయ ప్రతీకారచర్య అని జగన్మోహన్‌రెడ్డి అనడం హాస్యాస్పదమన్నారు. పార్టీ నాయకులు శివార్జునరెడ్డి, గుంటక లక్ష్మారెడ్డి, కిరణ్, రంగారావు, హరీశ్ పాల్గొన్నారు.



యనమలకుదురులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

యనమలకుదురులో..

పెనమలూరు: యనమలకుదురులో స్థానిక నేతలతో కలిసి టీడీపీ నాయకులు శొంఠి శివరాం ప్రసాద్, మొక్కపాటి శ్రీనివాస్ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించే కరపత్రాలను అందజేశారు. పథకాలు అందని వారు పోరంకిలోని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. తాడిశెట్టి వీరాస్వామి, బూక్యా రాజా, బలగం కొండ, సంపర శేఖర్, కందుల శివరాం, శేషు, కొక్కిలిగడ్డ సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.



ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ పరికరాల పనితీరును వివరిస్తున్న సిద్ధార్థ అకాడమీ అసోసియేట్ ప్రొఫెసర్ ఏ.విజయశంకర్

ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరుపై వర్క్‌షాప్

ఉంగుటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న ఎలక్ట్రానిక్ డివైజెస్(పరికరాలు)-వాటి పనితీరుపై పట్టుసాధించిన విద్యార్థులకు కెరియర్‌లో ఎదిగేందుకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్-డీమ్డ్ యూనివర్సిటీ(విజయవాడ)ఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.విజయశంకర్ సూచించారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ రెండో సంవత్సరం విద్యార్థులకు ఎలక్ట్రానిక్ డివైసెస్-ఇండస్ట్రీ యూజ్ కేసెస్ అనే అంశంపై సోమవారం ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విజయశంకర్ విచ్చేశారు. కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం, ఈసీఈ విభాగాధిపతి బి.నాంచారయ్య, ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్, డీన్‌ఆఫ్ ఆకడమిక్స్ సీహెచ్ శాంతిరాణి, కోఆర్డినేటర్ ఇ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఉంగుటూరు జడ్పీహైస్కూల్‌లో టెన్త్‌లో అత్యధిక మార్కులు (508) సాధించిన దాసరి బిందుకు నగదును అందజేస్తున్న దాతలు

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

ఉంగుటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : జడ్పీహైస్కూల్‌లో గత ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ బాలిక దాసరి బిందు(508)కు సోమవారం పాఠశాలలో రూ.10 వలే నగదు బహుమతిని అందజేశారు. ఎలుకపాడుకు చెందిన మున్నంగి ఏసేబు, వజ్రమ్మ దంపతులు, వారి పెద్దకుమారుడు ఇమ్మానియేలు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఈ కార్యక్రమంల నిర్వహించారు. హెచ్‌ఎం సీహెచ్ అనిత, అడ్డంకి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ బి.విజయరాజు, దాతలు మున్నంగి శాంతకుమారి, బి.హదసా, మున్నంగి జోసఫ్‌హెన్సి, ఎస్ఎంసీ ఛైర్మన్ పులి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మున్నంగి నిరీక్షణరావు పాల్గొన్నారు.



నానో లిక్విడ్ డీఏపీతో రైతులకు మేలు

ఉంగుటూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : వరిలో సంప్రదాయ ఘన డీఏపీ ఎరువుకు ప్రత్యామ్నాయంగా నానో డీఏపీ ద్రావణం(లిక్విడ్)వాడటం వల్ల రైతులకు మేలు జరుగుతుందని ఇఫ్‌కో జిల్లా మేనేజర్ జి.నందకిషోర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఇఫ్‌కో బృందం పర్యటించింది. వరి నారుమడులు, నాట్లు వేస్తున్న పొలాలను సందర్శించి ఎరువుల యాజమాన్యంపై రైతులకు పలు సూచనలు చేసింది. పొణుకుమాడులో వరినాట్లువేస్తున్న రైతులను కలిసిన నందకిషోర్‌రెడ్డి పొలంలో వేసిన ఎరువులపై ఆరా తీశారు. ప్రస్తుతం డీఏపీ, యూరియా కొరత నేపథ్యంలో రైతులు వరిపైరులో నానో లిక్విడ్ యూరియా, డీఏపీల వినియోగంపై దృష్టిసారించాలని సూచించారు. డీఏపీ కంటే నానో డీఏపీ ద్రావణం వరిపైరుపై బాగా పనిచేస్తుందని, ఖర్చు, సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఏవో గద్దె రమేష్, ఎస్ఎఫ్ఏ పి.సతీష్‌బాబు, ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, వీఏఏ రాఘవేంద్ర పాల్గొన్నారు.



ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డికి స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న సంగా నరసింహారావు

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పెనమలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆరున్నరకు రుద్రాభిషేకం, ఎనిమిది గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామిని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి సాయంత్రం ఏకాదశ రుద్రాభిషేకం, ఏడు గంటలకు పంచహారతులు, పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

యోగాసన పోటీల్లో పీవీపీ సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శివాజీబాబు

కానూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆటోనగర్‌లోని సాయి బాబా కల్యాణమండపంలో జరిగిన ఎన్టీఆర్ జిల్లా స్థాయి యోగా పోటీల్లో కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. విద్యార్థులను సోమవారం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అధ్యాపకులు అభినందించారు. కళాశాలలో ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదివే కేతా నేహారెడ్డి, మూడో సంవత్సరం చదివే వసుంధర గంగు, రెండో సంవత్సరం చదివే టీడీ జగదీష్ బంగారు పతకాలు, రెండవ సంవత్సరం చదివే భుక్య ఈశ్వరి రజిత పతకం సాధించారు. కార్యక్రమంలో కళాశాల పీడీ సాంబశివరావు, యోగా మాస్టర్ మూర్తిలు పాల్గొన్నారు.

పీ-4పై రెండో విడత సర్వే

హనుమాన్‌జంక్షన్, జూలై 21(ఆంధ్రజ్యోతి): పీ-4 మొదట విడత గుర్తించిన పేదల ప్రధాన అవరాలను నమోదు చేసేందుకు రెండో విడత సర్వే ప్రారంభించినట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో పీ-4 సర్వే ద్వారా మొదట విడత 4,875 మందిని గుర్తించామని, వారికి ఏ విధమైన సాయం కావాలో రెండో విడత సర్వే నిర్వహిస్తున్న సచివాలయం సిబ్బందికి తెలిపాలని సూచించారు. సర్వే ఆగస్టు 8వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు.

స్వచ్ఛరథం పైలెట్ ప్రాజెక్టుగా రామవరప్పాడు

ప్రసాదంపాడు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ రథం పైలెట్ ప్రాజెక్టు కింద రామవరప్పాడు పంచాయతీ ఎంపికైంది. ప్లాస్టిక్ నివారణలో భాగంగా ప్లాస్టిక్ బాటిల్స్ సేకరించి బరువు లెక్కగట్టి ఆ విలువకు సరిపడా నిత్యవసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జి ఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. రేషన్ సరుకులు డోర్ డెలివరీ చేసే వాహనాలనే వినియోగించనున్నట్లు తెలిపారు. ముందు భాగంలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేసేలా వెనుక భాగంలో సరుకులు కనిపించేలా రూపొందించనున్నారు. ప్రతి వాహనానికి నెలకు రూ.25 వేలు చెల్లించనున్నట్లు వెల్లడించారు. రోజుకు ఒక వార్డులోని వ్యర్థాలను సేకరించాలనే ప్రణాళికలను సిద్ధం చేయనున్నారు. ఆగస్టు 1 నుంచి రామవరప్పాడులో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

పేకాట ఆడుతున్న ఎనిమిది మంది అరెస్టు

పెనమలూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): యనమలకుదురు హోసన్నా మందిర్ రోడ్డులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని ఎస్సై టీడీఎస్ఆర్ ప్రసాద్ నేతృత్వంలోని పోలీసుల బృందం సోమవారం అదుపులోకి తీసుకొంది. వారి నుంచి రూ.10,700 స్వాధీనం చేసుకొన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట, కోడిపందేల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ జె.వెంకటరమణ హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కానూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మురళీనగర్ సబ్‌స్టేషన్ 11కేవీ వినాయక్‌నగర్ ఫీడర్ పరిధి కానూరు సెక్షన్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక్‌నగర్, నవతారోడ్డు, కేసీపీ స్కూల్ ఏరియాలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వర్షం కారణంగా సోమవారం చేయాల్సిన విద్యుత్ లైన్ల మరమ్మతులను మంగళవారానికి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

గన్నవరం సెక్షన్ పరిధిలో..

గన్నవరం, జూలై 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గన్నవరం సెక్షన్ పరిధిలో 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్, 11 కేవీ తెంపల్లి ఫీడర్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం సరఫరాను నిలిపిస్తున్నట్లు ఏఈ వెంకటరాజు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. తెంపల్లి, బల్లిపర్రు, మర్లపాలెం హౌసింగ్ కాలనీలోని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఉయ్యూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉయ్యూరులోని నేక్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని ఈనెల 30 నుంచి కొత్తబ్యాచ్ ప్రారంభిస్తున్నామని సెంటర్ ఇన్‌చార్జ్ ఎ.రవిసుధాకర్ తెలిపారు. ఎలక్ట్రీషియన్ (గ్రైండింగ్, సింగిల్ ఫేజ్, టూ ఫేజ్, త్రీఫేజ్‌లలో) శిక్షణ ఉంటుందని, 16 ఏళ్ల నుంచి 45 ఏళ్ల లోపు పురుషులు అర్హులని తెలిపారు. 10వ తరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, ఏదైనా డిగ్రీ చదివి ఉండాలన్నారు. ఆధార్‌కార్డు జిరాక్స్, స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 9392345939, 9032471773, 9491991954 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

డేంజర్ డేటింగ్



విజయవాడ నగరంలో ఉపాధి కోసం వచ్చిన కోనసీమ జిల్లా యువతిని కిలారు నాగతేజ అనే వ్యక్తి మోసం చేశాడు. లవ్లీ డేటింగ్ యాప్ ద్వారా ఆమెతో స్నేహం చేసి, నగరంలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి, కత్తితో బెదిరించి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని పరారయ్యాడు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జరిగిన ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, 26న నిందితుడు నాగతేజను అరెస్ట్ చేశారు. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) లెక్కల ప్రకారం, 2023-24లో డేటింగ్ యాప్స్ ద్వారా రూ.61 వేల కోట్ల దోపిడీ జరిగింది. గత ఏడాది డేటింగ్ యాప్స్ విస్తృతమైన నేపథ్యంలో, ఈ ఏడాది ఈ లెక్క మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ

యువతకు వలపు ఉచ్చు బిగించి స్మార్ట్‌గా దోపిడీ



ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో డేటింగ్ యాప్ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని సైబర్ విభాగం పోలీసులు తెలిపారు. వ్యక్తిగత మర్యాదలకు సంబంధించిన నేరం కావడంతో పోలీసులు పూర్తి వివరాలను బహిర్గతం చేయలేకపోతున్నారు. గత ఏడాదిలో ఎన్టీఆర్ జిల్లాలో 250 మంది డేటింగ్ యాప్స్ వల్ల ఆర్థికంగా నష్టపోయారు. విజయవాడ నగరంలోని 13 పోలీస్ స్టేషన్ల పరిధిలోనే అత్యధిక మంది బాధితులు ఉన్నారు. కృష్ణా జిల్లాలోని పెనమలూరు, గుడివాడ, పామర్రు, గన్నవరం, మచిలీపట్నం ప్రాంతాల్లో వంద మందికి పైగా బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఆన్‌లైన్ వేదికగా యాప్స్ విశృంఖలం

ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో డేటింగ్ యాప్ ఆర్థిక, శారీరక దోపిడీకి దోహదపడుతున్నాయని తాజా ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ముంబైలో సాఫ్ట్‌వేర్ కంపెనీలు అధికంగా ఉండటంతో, ఈ యాప్ నిర్వాహకులు రహస్యంగా కంపెనీలను నడుపుతున్నారు. ఫిర్యాదుల ఆధారంగా జాతీయ, స్థానిక సైబర్ క్రైం విభాగాలు కేసులు నమోదు చేస్తున్నాయి. కేసు నమోదైన వెంటనే యాప్ నిర్వాహకులు ప్రోగ్రామింగ్ మార్పు, పేరులో ఒక అక్షరం జోడించడం లేదా తొలగించడం ద్వారా 24 గంటల్లో కొత్త యాప్‌ను సిద్ధం చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉన్న ప్రాంతాల్లో వందల సంఖ్యలో డేటింగ్ యాప్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ కంపెనీల మధ్య పోటీ, రూ.50వేల నుంచి రూ.లక్షలోపు ప్రోగ్రామింగ్, కోడింగ్‌తో యాప్ రెడీ అయిపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది.

- డేటింగ్ యాప్స్‌తో భారీగా ఆర్థిక నేరాలు
- యువతీ, యువకులు, ట్రాన్స్ జెండర్ల ఫొటోలు, వీడియోలతో హనీ ట్రాప్
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో పెరుగుతున్న బాధితులు

సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం

సోషల్ మీడియా ఆల్గారిథమ్‌లు వీడియో, ఫొటోలపై వినియోగదారుల శ్రద్ధ, మనస్తత్వాన్ని అంచనా వేసి, డేటింగ్ యాప్ యాడ్స్‌ను చూపిస్తాయి. యాప్ డౌన్‌లోడ్ అయ్యేవరకు ఈ యాడ్స్ పదేపదే కనిపిస్తాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఈ యాప్స్ విస్తృత ప్రచారం చేస్తున్నాయి.

మధ్య వయసు, వృద్ధులే టార్గెట్

మధ్య వయస్కులు, వృద్ధులే ఎక్కువగా ఈ యాప్స్‌కు బాధితులవుతున్నారని సైబర్ పోలీసులు తెలిపారు. ఆస్తులు, సొమ్ములు ఉన్న 50ఏళ్ల పైబడిన వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. నగరాలు, పట్టణాల్లో కాల్ సెంటర్ల ద్వారా యువతీ, యువకులు, ట్రాన్స్‌జెండర్ల ఫొటోలను బ్లర్ చేసి, వారి వయసు, వృత్తిని ప్రదర్శిస్తూ ఆకర్షిస్తున్నారు. వాయిస్, వీడియో, టెక్స్ట్, గ్రూప్ చాటింగ్‌లకు రేట్లు నిర్ణయించి డబ్బులు గుంజుతున్నారు. వీడియో చాటింగ్‌లో న్యూడ్ వీడియో రికార్డింగ్‌ల ద్వారా హనీ ట్రాప్స్‌కు పాల్పడుతున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి.



కొన్ని డేటింగ్ యాప్స్

టిండర్, బంబుల్, హింగే, ఓకేకుపిడ్, ఐస్లీ, హపన్, క్వాక్‌క్వాక్, ట్రూలీమ్యాడ్లీ, ఊఫ్లస్, టాన్‌టాన్, బూ, మింగిల్, దిల్ మిల్, అరికే, సీకింగ్, లక్సీసెలబ్స్, డేట్‌పసియా, ఎస్‌డీసీఅడల్ట్, మిజ్‌హి, సీక్రెట్ చాట్, కుపిడ్, మీట్, సీతో, అన్నీ, జలేబీ, నేనే, గ్రఫ్, రెడ్డిట్, ఫ్లటర్, రోమియో, హాట్ గార్ల్, గార్ల్‌ర్యాండమ్.



జాగ్రత్తలు తీసుకుంటున్నాం

ఎస్వీ రాజశేఖరబాబు, సీపీ, ఎన్టీఆర్ జిల్లా

సైబర్ నేరాల నివారణకు జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించడంతో గత ఏడాదిలో నేరాల సంఖ్య తగ్గిందని తెలిపారు. బ్యాంకర్లతో సమన్వయంతో డిజిటల్ అరెస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, డేటింగ్ యాప్ మోసాలను అడ్డుకున్నామని, అయినప్పటికీ కొన్ని మోసాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ నేరానికి గురైతే గోల్డెన్ అవర్‌లో 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, సైబర్ పోలీసుల సూచనలు పాటించాలని సూచించారు.



మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

డ్రెయినేజీ వ్యవస్థపై దృష్టి పెట్టండి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగర పరిధిలో డ్రైనేజీ వ్యవస్థపై దృష్టిపెట్టాలని, నిర్వహణపరంగా ఎక్కడా లోపాలు ఉండటానికి వీల్లేదని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు స్పష్టం చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు కలెక్టర్ లక్ష్మీశ సోమవారం వివిధ ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు ముందు పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, నిర్మల్ కాన్వెంట్ రోడ్డు, వన్‌టౌన్‌లో బ్రిడ్జి ప్రాంతాలను పరిశీలించగా, పీజీఆర్ఎస్ ముగిశాక దేవీనగర్, న్యూ రాజరాజేశ్వరీపేట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం, సక్రమ మురుగునీటి పారుదల, రక్షిత తాగునీరు అనేవి ప్రజలు ఆరోగ్య భద్రతకు చాలా కీలకమని డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకుంటే మురుగునీరు రోడ్లపైకి చేరడంతో దుర్వాసనతో పాటు దోమలు పెరిగి ప్రజలు డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి విష జ్వరాల బారినపడే ప్రమాదముందన్నారు. కాలువ ప్రారంభం నుంచి చివరి వరకు పూడికలు లేకుండా చూడాలన్నారు. అలాగే ఎక్కడా వర్షపు నీరు నిలిచిపోకుండా చూడాలన్నారు. ఎక్కడైనా నీళ్లు నిలిచినా, డ్రైనేజీ సమస్య ఉన్నా 91549 70454 నెంబరుకు సమాచారమివ్వాలని కలెక్టర్ సూచించారు. అలాగే చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ వస్తువులు వంటి వాటిని కాలువల్లోకి నెడితే తిరిగి ఆ చెత్తే అంతులేని అనారోగ్యాల రూపంలో మన నెత్తినపడుతుందని, వ్యర్థాలను వేరుచేసి, పారిశుధ్య సిబ్బందికి ఇవ్వడం, పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయంగా ఉండే వస్తువులను ఉపయోగించేలా అవగాహన కల్పించాలన్నారు. యజమానులకు నోటీసులు పంపి, మొక్కలు నాటేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాథరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీ సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ ఉన్నారు.



ట్రైనీ ఐపీఎస్‌ల బృందం సీఆర్‌డీఏ కార్యాలయ సందర్శన

కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయాన్ని ట్రైనీ ఐపీఎస్‌ల బృందం, సంబంధిత అధికారులు సందర్శించారు. ఈ బృందానికి రాజధాని అమరావతి నిర్మాణంలో అమలైన భూ సమీకరణ పథకం గురించి, రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు, అమరావతి ప్రాంత ప్రజలకు సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ పథకాల గురించి సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ మల్లారపు నవీన్, సీఆర్‌డీఏ ఎకనమిక్ డెవలప్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ బీ వినీష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు. అలాగే అమరావతిలో నిర్మిస్తున్న గవర్నమెంట్ కాంప్లెక్సు, ఇతర భవనాలతో పాటు సీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని హరిత యుత విధానాలతో నిర్మిస్తున్నామన్నారు. ఆయా భవనాలు ఎడ్జ్ గ్రీన్ సర్టిఫికేషన్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం అమరావతిలో స్థాపించబడిన ప్రముఖ విద్యా, వైద్య సంస్థల గురించి, అతి త్వరలో అమరావతిలో కార్యకలాపాలు ప్రారంభించనున్న సంస్థల గురించి వివరించారు. క్వాంటం వ్యాలీ గురించి, దాని సాంకేతికత పాత్ర గురించి వివరించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నవ నగరాలతో, విస్తృత మౌలిక వసతులతో అమరావతి నగరాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు. ట్రైనీ ఐపీఎస్‌ల బృందానికి, సంబంధిత అధికారులకు అదనపు కమిషనర్ జ్ఞాపికలు అందచేశారు. త్వరలో ఐపీఎస్‌లుగా బృందంలోని సభ్యులు బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో అభినందనలు తెలిపి చేపట్టిన బాధ్యతల్లో రాణించాలని ఆశిస్తున్నామన్నారు.

కాలువల అభివృద్ధికి సొంత నిధులు

- రూ.5లక్షలతో పూడికతీత పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే సౌమ్య
- కృతజ్ఞతలు తెలిపిన ఆయకట్టు రైతులు
- జీరో పాయింట్ వద్ద రిటైనింగ్ వాల్ నిర్మించాలి

నందిగామ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య మునేటి కాలువ ఆయకట్టు రైతులకు అండగా నిలిచారు. ఏళ్లతరబడి పూడికతో నిండిన కాలువల అభివృద్ధికి రూ.5 లక్షల సొంత నిధులతో పూడికతీత పనులు చేపట్టారు. అనాసాగరం రైతుల అభ్యర్థన మేరకు ఈ చొరవ తీసుకోవడంతో ఖరీఫ్ సాగుకు ఊతం లభించింది.

జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వెంకటాపురం, పొన్నవరం గ్రామాల వద్ద మునేటి నుంచి ప్రారంభమయ్యే ఈ కాలువ, నందిగామ మీదుగా అంబారుపేట చెరువు వరకు 12 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఈ ఆయకట్టులో 1240 ఎకరాల భూమి సాగులో ఉంది. కానీ, నందిగామ నుంచి అంబారుపేట వరకు 4 కిలోమీటర్ల కాలువను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి అమ్ముకున్నారు. దశాబ్దాలుగా జరిగిన ఈ ఆక్రమణల వల్ల ఆ భాగంలో ఆయకట్టుకు నీరు అందడం లేదు. అనాసాగరం వరకు 9 కిలోమీటర్ల ఆయకట్టుకు మాత్రమే నీరు అందుతోంది. వైసీపీ పాలనలో కాలువ నిర్లక్ష్యానికి గురై, పూడిక, కంప చెట్లతో నిండిపోయింది. పొన్నవరం వద్ద జీరో పాయింట్‌లో వైసీపీ నేతలు 20 అడుగుల లోతు వరకు మట్టి తవ్వి అమ్ముకున్నారు. దీంతో మునేటి నుంచి కాలువకు రావలసిన నీరు దిశ మారి మళ్లీ మునేటిలోకి వెళ్లిపోతోంది. రైతులు సొంత నిధులతో అరకొర మరమ్మతులు చేసుకున్నా, సమర్థవంతంగా నీరందక పంటలు నష్టపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులు కాలువ పునరుద్ధరణ, ఆక్రమణల నివారణపై ఆశలు పెట్టుకున్నారు. అనాసాగరం రైతులు తమ సమస్యను సౌమ్య వద్దకు తీసుకెళ్లగా, ఆమె తాత్కాలిక మరమ్మతులకు సొంత నిధులతో సోమవారం పూడికతీత పనులు ప్రారంభించారు. జీరో పాయింట్ వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. మట్టి దోపిడీ, నీటి ప్రవాహ ఉధృతి వల్ల ఈ ప్రాంతం అస్తవ్యస్తంగా మారి, నీరు వృథా అవుతోంది. రిటైనింగ్ వాల్ నిర్మిస్తే కాలువ ఆయకట్టుకు మేలు జరుగుతుంది. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలోని ఈ కాలువ అభివృద్ధికి సౌమ్య, శ్రీరామ్ రాజగోపాల్ కృషి చేయాలి. దీనికి రూ.50 లక్షలతో అంచనా సిద్ధం చేసిన అధికారులు, నిధులు త్వరగా సమీకరించి, కాలువ పటిష్ఠతకు చర్యలు చేపట్టాలి.




పూడికతీత పనులు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, జీరో పాయింట్ వద్ద పూడికతో నిండి ఉన్న కాలువ

ఎమ్మెల్యే సౌమ్యకు రైతుల కృతజ్ఞత

ఎమ్మెల్యే సౌమ్య సొంత నిధులతో చేపట్టిన పూడిక తీత పనులకు అనాసాగరంతోపాటు పలు గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ సీనియర్ నేత చలమల కృష్ణ, నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, టీడీపీ పట్టణాధ్యక్షుడు ఏచూరి రామకృష్ణ, కాసర్ల లక్ష్మీనారాయణ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి: డీఆర్వో

మచిలీపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం మచిలీపట్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు ఎస్పీ సత్యనారాయణ, మెప్మా పీడీ సాయిబాబు, కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ శ్రీదేవి, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజుతో కలిసి ప్రజాసమస్యల పరిష్కార వేదిక మీ కోసం నిర్వహించి ప్రజల నుంచి 165 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో అధికారులతో సమీక్షించారు. రాష్ట్రప్రభుత్వం మీకోసం అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వాటిని సకాలంలో పరిష్కరించి ప్రజల్లో సంతృప్తస్థాయి పెంచాలన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 10 సూత్రాలపై శకటాలు రూపొందించేందుకు సంసిద్ధం కావాలన్నారు. ఐ గాట్ కర్మయోగి ఆన్‌లైన్ శిక్షణ తరగతుల్లో భాగంగా 15 కోర్సులు వచ్చే వారంలోగా ఉద్యోగులందరూ పూర్తిచేయాలన్నారు. రియల్ టైం గవర్నెన్స్ కింద జిల్లాలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో జారీచేసే సర్క్యులర్లు, నోటిఫికేషన్లు, ఉత్తర్వులు, నియామకాలు, నిబంధనలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పీ4కు సంబంధించి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో బంగారు కుటుంబాలు, మార్గదర్శిల విజయగాథలను సిద్ధం చేసి ఆగస్టు 15న ఆవిష్కరించాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఆయన వ్యవసాయశాఖ రూపొందించిన గోపడత్రికను డీఆర్వో చంద్రశేఖరరావు, వ్యవసాయ అధికారి మనోహర్, ఏడీ మణిధర్, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ముగ్గురు అంతకు మించి పిల్లలున్న కుటుంబాల్లో లక్కీడిప్ ద్వారా ఎస్ నాగజ్యోతి, బొమ్మిడి నాగరాజు, ఎల్ లక్ష్మి పార్వతిని ఎంపికచేసి ప్రశంసాపత్రం, ఒక్కొక్కరికి రూ.5వేల నగదు ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. పీపీఐయూసీడీ, వేసక్టమీకి అంగీకరించిన కుటుంబాల్లో గంటా పావని, యోగి కిరణ్, అనుములకొండ అనుపమను ఎంపికచేసి వారికి ప్రశంసాపత్రం, నగదు బహుమతులను అందచేశారు. ఉత్తమ గైనకాలజిస్టుగా డాక్టర్ సుచిత్రకు రూ.8వేలు, ఉత్తమ వేసెక్టమి సర్జన్‌గా డాక్టర్ హరిరంగప్రసాద్‌కు రూ.7వేలు, అధిక సంతానానికి పాటుపడి ఉత్తమ ప్రేరకురాలిగా నిలిచిన ఏఎన్ఎం బీ వాణి, ఆశ కార్యకర్త సీహెచ్ యమలీయమ్మ, శ్రీపతి డాలిసుకన్యకు రూ.2500 చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను, ప్రశంసాపత్రాలను అందచేశారు. జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డ్వామా డీఆర్‌డీఏ పీడీలు శివప్రసాద్, హరిహరనాథ్, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేష్, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మీకోసంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో చంద్రశేఖరరావు

కోనేరు హంపికి శాప్ చైర్మన్ అభినందన

విజయవాడ స్పోర్ట్స్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జార్జియాలో జరుగుతున్న ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి సెమీఫైనల్‌కు చేరుకోవడం హర్షణీయమని శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా హంపికే రికార్డు దక్కిందని, ఇది తెలుగు ప్రజలకు గర్వకారణమని ఈసందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు రవినాయుడు తెలిపారు.

పోలవరం కాలువలో యువకుడి గల్లంతు


- ఎన్డీఆర్ఎఫ్ గాలింపు చర్యలు

పాయకాపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పోలవరం కాలువలో పడి ఓ యువకుడు గల్లంతైయ్యాడు. ఆ యువకుడి ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన పతివాడ మధు (25) జియో కంపెనీలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తన సోదరుడు జగన్, మరో స్నేహితుడితో కలిసి ముగ్గురూ ద్విచక్రవాహనంపై పోలవరం కాలువ మీదుగా పాతపాడు పయనమయ్యాడు. మార్గమధ్యంలో మూత్ర విసర్జనకు మధు వాహనాన్ని నిలిపి కాలువ అంచుకు వెళ్లాడు. వర్షం పడుతుండటంతో కాలుజారి ప్రమాదవశాత్తూ కాలువలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న నున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఎన్డీఆర్ఎఫ్ సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం కూడా సుమారు 20 కిలోమీటర్ల మేర గాలింపు చర్యలు చేపట్టిన మధు ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం మరోమారు గాలింపు చర్యలు చేపట్టనున్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. ఇబ్రహీపట్నం పీఏసీఎస్ త్రీ మ్యాన్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీఏసీఎస్ చైర్ పర్సన్‌గా కోయ నెహ్రూ, సభ్యులుగా రాగ చిన్న జమలయ్య, నడకుదిటి విఘ్నేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ త్రీమెన్ కమిటీ సభ్యులు రైతులకు మెరుగైన సేవలందించాలన్నారు. అనంతరం సుపరిపాలనలో తొలి అడుగులో పాల్గొని మాట్లాడుతూ మద్యం, ఇసుక పాలసీలు అడ్డం పెట్టుకొని 2019 నుంచి 2024 వరకు జగన్మోహన్ రెడ్డి వేల కోట్లు దోచుకున్నారన్నారు. వాటిని ఎలా దాచుకోవాలో కూడా ముందుగా ప్లాన్ చేసుకున్నాడన్నారు. రూ.3,500 కోట్ల కంటే ఎక్కువే దోచుకొని ఉంటాడన్నారు. గత ఎన్నికల్లో ఒక్క మైలవరంలోనే రూ.55కోట్లు వైసీపీ ఖర్చు చేసిందన్నారు. మైలవరంలో ఒక సామాన్య ఆసామి ఓటుకు రూ.2వేలు పంచాడన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వైసీపీ రూ.300కోట్ల పైనే ఎన్నికల్లో ఎలా ఖర్చు చేసిందో ప్రజలు గమనించాలన్నారు. కూటమి నేతలంతా ఐకమత్యంగా ఉండి 2029లో జగన్ అనే భూతాన్ని శాశ్వతంగా భూస్థాపితం చేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, రామినేని రాశేఖర్, చనమోలు నారాయణ, చుట్టుకుదురు శ్రీనివాసరావు, అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ) పాల్గొన్నారు.



త్రీ మ్యాన్ కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

జరీబు రైతులకిచ్చే ప్లాట్లకు నేడు ఈ-లాటరీ

కలెక్టరేట్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాకార సంస్థ (సీఆర్‌డీఏ) పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను సీఆర్‌డీఏ వారికి అప్పగించిన పెనుమాక జరీబు రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించేందుకు 22న మంగళవారం ఉదయం 10 గంటల నుంచి విజయవాడ లెనిన్ సెంటర్‌లోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ-లాటరీ జరుగుతుంది. ఇందులో భాగంగా 800 మంది రైతులకు 1848 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తారు. వీటిలో 1082 రెసిడెన్షియల్ ప్లాట్లు కాగా 766 కమర్షియల్ ప్లాట్లు. రైతులు హాజరుకావాలని అధికారులు కోరారు. మంగళవారం నాటి ఈ-లాటరీకి హాజరుకాకుంటే రైతులు తమ రిటర్నబుల్ ప్లాట్ ప్రొవిజనల్ సర్టిఫికెట్లను కాంపిటెంట్ అథారిటీ, పెనుమాక వారి కార్యాలయంలో పొందవచ్చని అధికారులు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి: ఏఐఎస్ఎఫ్

గవర్నర్‌పేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. సోమవారం దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సాయి కుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లోని రూ. 6400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం విడుదల చేయాలని కోరారు. ఒంగోలులో ఉన్న ట్రిపుల్ ఐటీ కళాశాల భవనాలకు అద్దె కట్టని కారణంగా మూసివేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సదుపాయాలు అధ్వాన్నంగా ఉన్నాయని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నేతలు సాధిక్‌బాబు, కార్తీక్, రంజిత్, సురేష్, మోనిష, ధోనీ, సందీప్, యశ్వంత్ పాల్గొన్నారు.

బీసెంట్ రోడ్డు ఆక్రమణలు తొలగింపు

- రోడ్డును సుందరంగా తీర్చిదిద్దే పనులకు శ్రీకారం

విజయవాడ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ వ్యాపార సముదాయం బీసెంట్ రోడ్డును ఆక్రమణల చెర నుంచి విడిపించేందుకు మునిసిపల్ కార్పొరేషన్ రంగంలోకి దిగింది. హైకోర్టు ఆదేశాల మేరకు అక్కడి వ్యాపారస్థులతో కలిసి కార్పొరేషన్ ఈ పనులు చేపడుతోంది. ఆక్రమణలను తొలగించిన వెంటనే ఆ ప్రాంతాన్ని సుందరంగా తయారు చేయాలన్నదే వీఎంసీ లక్ష్యం. వస్త్ర, ఫ్యాన్సీ వ్యాపారంతో బీసెంట్ రోడ్డు రాష్ట్రంలోనే పేరు సంపాదించింది. నగరంలోని ఎంజీ రోడ్డు నుంచి ఏలూరు రోడ్డు వరకు సుమారు కిలోమీటరు పొడవుండే ఈ రోడ్డుకు ఇరువైపులా వందలాది షాపులున్నాయి. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆ ప్రాంతం కిక్కిరిస్తుంది. అందుబాటు ధరల్లో బట్టలు, ఫ్యాన్సీ వస్తువులు లభించడంతో రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలుదారులు వస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో కొందరు వ్యక్తులు తమ వ్యాపారాలకు రోడ్డును ఆక్రమించేశారు. దీంతో ఆ ప్రాతం రద్దీగా మారింది. కొనుగోలుదారులు నడిచేందుకైనా వీలు లేకుండా ఉండేది. దీంతో ఆక్రమణలను తొలగించాలని అధికారిక వ్యాపారులు కోర్టులను ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. జేసీబీల సాయంతో రోడ్డుకిరువైపులా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను, డ్రెయినేజీ ఆక్రమణలను తొలగిస్తున్నారు. దీంతో బీసెంటు రోడ్డు 40 అడుగుల వెడల్పుతో విశాలంగా కనిపిస్తోంది. అయితే తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారు, రోడ్డు ఆక్రమించి వ్యాపారం చేసుకునే వారు జీవనోపాధి కోల్పోకుండా రోడ్డు వెంబడి కొన్ని ప్రదేశాల్లో షాపులు కేటాయించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. తొలగింపు పనులు పూర్తయ్యాక ఆ ప్రాంతాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలనేది కార్పొరేషన్ లక్ష్యం.



బీసెంట్ రోడ్డులో అక్రమంగా ఏర్పాటు చేసిన కొన్ని తాత్కాలిక దుకాణాలను తొలగించగా విశాలంగా మారిన రోడ్డు

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	228
చికెన్ స్కిన్‌లెస్	238

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

గంగానమ్మకు ఆషాఢ సారె

గుడ్లవల్లేరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కౌతవరం గ్రామమహిళలు సోమవారం గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారికి ఆషాఢమాస సారెను సమర్పించారు. మేళతాళాలతో మంగళవాయిద్యాలతో మహిళలంతా కలసి అమ్మవారికి సారెను ఊరేగింపు నిర్వహించి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సారెను గంగానమ్మ అమ్మవారికి సమర్పించారు.


ఆషాఢ సారెను తీసుకువెళుతున్న కౌతవరం గ్రామ మహిళలు

వరినాట్లు వర్షార్పణం

- పామర్రులో నీట మునిగిన పొలాలు
- సాగుచేసిన అన్నదాతల దిగాలు
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు

(ఆంధ్రజ్యోతి - పామర్రు): గడిచిన నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సాగు చేసిన వరినాట్లు పామర్రు మండలంలోని పలుగ్రామాల్లో వర్షార్పణం అయ్యాయి. దీంతో ఈ ఏడాది ఎన్నో ఆశలతో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన అన్నదాతలకు ప్రారంభదశలోనే సాగుకు కష్టాలు ప్రారంభ మైనట్టుగా పరిస్థితి కనిపిస్తుంది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పామర్రు పరిధిలో గడిచిన నెలవ్యవధిలో వరినాట్లు వేసిన వేలాది ఎకరాలు నాట్లు వర్షాపు నీటి ముంపు భారిన పడ్డాయి. దీంతో అన్నదాత సాగు ప్రారంభ దశలో ఇదేం ఖర్మ అంటూ తీవ్రస్థాయిలో సత మతమౌతున్నాడు. అప్పులు చేసి సాగు చేసిన కౌలు రైతుల పరిస్థితి అయితే వర్ణణాతీతంగా మారింది. కొరిమెర్ల, ఎలకుర్రు, ప్రొకెర్ల, నిమ్మలూరు తదితర గ్రామాల్లోని రైతులు లబోదిబో మంటున్నారు.

ఇప్పటికే కౌలు రైతు ఎకరాకు వరినాట్లు వేసేందుకు దాదాపు రూ.15వేల రూపాయలు ఖర్చు చేసి నాట్లు పని పూర్తి చేసినట్టు కొరిమెర్లకు చెందిన రైతులు వల్లూరిపల్లి రాజేంద్రప్రసాద్, కొడాలి పూర్ణచంద్రరావు, కామినేని సుధాకర్, పరచూరి రవీంద్రనాథ్ కౌలు రైతులు కొనకళ్ల సురేష్, బలుసు లక్ష్మణ స్వామి తదితర రైతులు వాపోయారు. దీనికి తోడు డ్రెయినేజీ శాఖ వారి నిర్లక్ష్యం వారి పట్ల శాపంగా మారిందని పలువురు మండి పడుతున్నారు. ఖరీఫ్ సాగుకు ముందే వ్యర్థాలతో కుచించుకు పోయిన పంట కాల్వలను శుభ్రపరిచినట్లయితే తమకు ఇంత కష్టం వచ్చేది కాదంటున్నారు. వారి నిర్లక్ష్యానికితోడుగా కురుస్తున్న వర్షాలవల్ల కాల్వలు పొంగి ప్రవహించి వచ్చిన నీరు పోలాల్లో చేరి నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక వేసిన నాట్లు కుళ్లి పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల వల్ల నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వమే ఆదుకోవాలని అయాగ్రామాల రైతులు వేడుకుంటున్నారు. పాలకులు రైతులఎదుర్కొంటున్న సమస్యలకు ఎలకుర్రు, కొరిమెర్ల గ్రామాల్లో అవసరమైన రెండు కాల్వర్టులు నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


కొరిమెర్లలో చెరువులను తలపిస్తున్న పంట చేలు

తక్షణమే అధికారులు స్పందించాలి



కురుస్తున్న వర్షానికితోడు డ్రెయినేజీ సరిగా లేకపోవడంతో ఎంతో ఖర్చుతో వరి నాట్లు వేసిన పోలాల్లోని నీరు బయటకు వెళ్లే మార్గంలేకపోవడంతో పంట దెబ్బతినే ప్రమాదం కనిపిస్తుంది. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి పొలాల్లో మురుగు నీరు బయటకు పోయే మార్గం చూపి అన్నదాతకు న్యాయం చేయాలి.

రవీంద్రనాథ్, కొరిమెర్ల రైతు

నాట్లు కుళ్లిపోయే అవకాశం ఉంది



నాట్లు వేయడం కోసం ఇప్పటివరకు రూ. 15వేలు ఎకరానికి ఖర్చుచేశాను. అయితే నాలుగైదు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి తాను కౌలుకు చేస్తున్న దాదాపు నాలుగు ఎకరాల్లో పంట ముంపుబారిన పడింది. వర్షపునీరు బయటకు పోయే మార్గంలేక వేసిన నాట్లు కుళ్లిపోయే అవకాశం కనిపిస్తుంది.

కొనకళ్ల సురేష్, కౌలురైతు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

నందివాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం మండలంలోని అనమనపూడి, గండేపూడి, పొనుకుమాడు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని రావి వెంకటేశ్వరరావుతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ గ్రామ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనమనపూడిలో మహిళలు వంద రోజులు పని నెలలో పది రోజులు మాత్రమే చూపిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా గ్రామంలోకి రావాలంటే ఆర్ అండ్‌బీ రోడ్డు గోతులమయంగా ఉంది. గుడివాడ వెళ్లాలంటే నరకముగా ఉంది కనీసం రోడ్డు మరమ్మతులు చేయించాలని వెనిగండ్లను గ్రామస్థులు కోరారు. గ్రామస్థుల 100 రోజుల పథకంపై పంచాయతీ కార్యదర్శి రమేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో గ్రామస్థులకు వంద రోజుల పని ఆపే ప్రసక్తే లేదన్నారు. అనంతరం గండేపూడి, పొనుకుమాడు గ్రామస్థులు రోడ్లపై గ్రామ సమస్యలు వివరించారు. అనంతరం రావి, వెనిగండ్ల కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పిన్నమనేని పూర్ణ వీరయ్య (బాబ్జీ), దానేటి సన్యాసిరావు, కూచిపూడి సత్యం, తిరుమలశెట్టి మురళీ ప్రసాద్, శ్రీనివాసరావు, గొర్జి సత్యనారాయణ, ప్రభాకర్, రాధాకృష్ణ, పాల్గొన్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు

పామర్రు: ప్రతి పేదవారికీ సంక్షేమ పథకాలందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నేతలు మంతెన రామాంజనేయులు,పరిసే సుబ్రమణ్యంలు పేర్కొన్నారు. స్థానిక 19వార్డులో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం పేద,బడుగు, బలహీన వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంచారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, వార్డు సభ్యులు వీరంకి వేంకటేశ్వరరావు, వీరంకి మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.


పామర్రులోని 19వ వార్డులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న టీడీపీ నేతలు

పెళ్లి పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గుడివాడ, జూలై 21(ఆంధ్రజ్యోతి) : భర్త చనిపోయి ఒంటరిగాఉన్న వితంతువును ప్రేమ, పెళ్లి పేరుతో ఒక వ్యక్తి మోసం చేసిన సంఘటన గుడివాడలో చోటుచేసుకుంది. స్థానిక జీవీఆర్ స్ట్రీట్‌కు చెందిన బుర్రా వెంకటరమణ భర్త చనిపోవడంతో ఒంటరిగా జీవిస్తోంది. ఈ క్రమంలో వడ్డాది శివకృష్ణ కన్ను ఆమెపై పడింది. ఒంటరిగా ఉన్న ఆమెను పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని ఇస్తానంటూ నమ్మబలికాడు. ఈ క్రమంలో ఆమె వద్ద ఉన్న రూ.2లక్షల నగదును నమ్మకంగా కాజేసాడు. వెంకటరమణకు చెందిన 8కాసుల బంగారాన్ని తాకట్టు పెట్టుకున్నాడు. బయట వ్యక్తి వద్ద నుంచి వెంకటరమణ పూచీకత్తుతో రూ.50వేలు అప్పుగా తీసుకున్నాడు. పెళ్లి చేసుకోమని పలుమార్లు అడిగిన దాటవేస్తూ కాలం వెళ్లదీయసాగాడు. ఈ క్రమంలో బయట వ్యక్తి నుంచి తీసుకున్న రూ.50వేలు అప్పు కట్టాలని శివకృష్ణను వెంకటరమణ నిలదీసింది. తనకు పెళ్లాం, పిల్లలున్నారని, తాను ఎట్టి పరిస్థితుల్లో అప్పును కట్టనని, పెళ్ళి కూడా చేసుకోబోనని ఖరాఖండిగా తేల్చి చెప్పాడు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన వెంకటరమణ సోమవారం ఒన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

డ్రెయినేజీ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల దృష్ట్యా ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం రామన్నపూడి, తట్టివర్రు గ్రామాల్లోని పంట కాలువలు, పంట పొలాలను ఆయన పరిశీలించారు. డ్రెయినేజీ, ఇరిగేషన్ కాలువల్లో నీరు ఏ విధంగా ప్రవహిస్తున్నది, వరి నారుమడులు, నాట్లు వేసిన పొలాల్లో ఏమైనా నష్టం వాటిల్లిందా? తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు అధైర్యపడవద్దని, కూటమి ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులు రావటానికి కృషి చేస్తామన్నారు. ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు ఎప్పటికప్పుడు పంట నష్టపోయిన వివరాలు తెలియజేయాలని కోరారు. కాలువ గట్లకు గండ్లు పడకుండా చూడాలన్నారు. వరి పొలాలు ముంపునకు గురికాకుండా పర్యవేక్షించాలని కోరారు. పంట పొలాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా కూటమి నేతలను నేరుగా కలసి సంప్రదించాలన్నారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో పంట కాపాడుకోవటానికి అన్ని రకాలుగా కృషి చేస్తామని ఆయన తెలిపారు. వర్షాకాలంలో రైతులు ఏమైనా ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులకు ఫోన్లు చేస్తే స్పందించాలన్నారు. కూటమి నేతలు అందరూ భారీ వర్షాలు తగ్గే వరకు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరి నారుమడులు మునగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గోకవరపు సునీల్, చెరుకూరి జగన్మోహనరావు, రామన్నపూడి మాజీ సర్పంచ్ మసిమక్కు గోపాలకృష్ణ, సూరపనేని రామకృష్ణ, కైలే కాళిదాసు, కైలా రంజిత్, ఫణి, గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


రామన్నపూడిలో కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుంతలు దాటితే.. గండం గడిచినట్టే..

కూచిపూడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలు గ్రామాల్లోని రహదారులు చిత్తడిగా మారాయి. దీంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొవ్వ బస్టాండ్ ప్రాంతంతో పాటు కూచిపూడి ప్రధాన రహదారి, పెదపూడి, బార్లపూడి రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. కూచిపూడి బస్టాండ్ ప్రాంతంతోపాటు పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. దీనికి తోడు ఖరీఫ్ పనులు ప్రారంభం కావటంతో దమ్ము ట్రాక్టర్లు రోడ్లపై తిరగటంతో చక్రాలకు ఉన్న మట్టి రోడ్లపై పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు రహదారుల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు - అడ్డాడ ప్రధాన రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గుడ్లవల్లేరు నుంచి పెంజంద్ర వరకూ గుడ్లవల్లేరు మండల పరిధిలో దాదాపు 4 కిలోమీటర్లు దూరం ప్రయాణానికి దాదాపు 20 నిమిషాలు ప్రయాణించాల్సి వస్తోంది. చిత్రం మురికికాల్వ వంతెన వద్ద నుంచి మొదలుకొని పెంజంద్ర మురుక్కలవ వంతెన దాటి ఐనంపూడి వరకూ రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. ద్విచక్రవాహన చోదకులకు పలుమార్లు రోడ్డుప్రమాదాలకు గురైన ఉదంతాలు అనేకమున్నాయి. ఎమ్మెల్యే రాము చొరవతో ప్రభుత్వం ఈ రహదారికి రూ.50 లక్షలు నిధులు అర్జెంట్ పనులుగా మంజూరు చేసి టెండరు పిలిచారు. నిధులు ఖరారై నెలలు గడిచినా టెండరు చేజిక్కించుకున్న కాంట్రాక్టరు మాత్రం పనులు మొదలుపెట్టడం లేదు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులను ఈ విషయమై అడుగగా కాంట్రాక్టరు పనులు మొదలుపెట్టాలని ఇది అర్జెంట్ వర్క్ క్రింద ఇచ్చి నిధులని చెబుతున్నారు.


కూచిపూడిలో గోతుల్లో నిలిచిన వర్షపు నీరు


గుడ్లవల్లేరులో అగాథంలా ఏర్పడిన గుంతలు

ఫేస్ యాప్‌తో తప్పని తిప్పలు

కూచిపూడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మొవ్వ సీడీపీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్లపై వేధింపులు నిరోధించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులు, బాలింతలు ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల గల పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే టేక్ హోమ్ రేషన్ విధానంలో ముఖ గుర్తింపు విధానం రద్దు చేయాలని నాణ్యమైన ఫోన్లు అందించాలని కోరారు. అనంతరం సీడీపీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ నేతలు ఎస్.విజయలక్ష్మీ, దగాని రాజారత్నం, తాతా శివకుమారి, సీహెచ్.సత్యవతి, సీహెచ్.గంగాభవాని, సీఐటీయూ నేతలు శీలం నారాయణరావు, ఎండి.కరిముల్లా పాల్గొన్నారు.


మొవ్వలో ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

గుడివాడ : ఫేస్ యాప్‌లతో ఇబ్బందులు పడుతున్నామని, దీంతో తల్లులకు సమయానికి భోజనం అందించలేకపోతున్నామని, వెంటనే ఫేస్ యాప్‌లను తొలగించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రాజెక్టు లీడర్లు టి.వాణి, గీత, త్రివేణి, నిర్మల జ్యోతి, రమాదేవి, వెంకటరమణ, పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

గుడ్లవల్లేరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు 2025-26 సంవత్సర నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం లయన్స్ సేవాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా లయన్స్ జిల్లా 316డి మాజీ గవర్నర్, విశ్వహిందూపరిషత్ జాతీయ ట్రస్టీ డాక్టర్ పుట్టగుంట వెంకట సతీష్ కుమార్ పాల్గొనగా మరో జిల్లా మాజీ గవర్నర్ మిరియాల వెంకటే శ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. నూతన సభ్యులచే గద్దే శేషగిరి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం పలువురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ప్రతీనెలా నిర్వహించే మధుమేహవ్యాధి చికిత్సా శిబిరానికి సర్వీస్ చేస్తున్న కె.మురళి, నవ్య, దీప్తి, చరన్‌సింగ్, ఫణిగోపాల్‌లను సన్మానించారు. అనంతరం నూతన కార్యవర్గంలో అధ్యక్షుడు మేరుగు పెరుమాళ్లరావు, కార్యదర్శి కల్యాణపు నవాబు, కోశాధికారి పెంటపాటి చిట్టిబాబు, ఉపాధ్యక్షుడిగా పొట్లూరి రవికుమార్, మెంబర్‌షిప్ చైర్మన్‌గా సూరపనేని పరంధామయ్య, మార్కెటింగ్ చైర్మన్‌గా జంగం మోహనరావు మరో 20 మంది డైరెక్టర్లచే ప్రమాణ స్వీకారం చేయించి కార్యవర్గాన్ని పలువురు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా గవర్నర్ జేఎం శంకర్‌గుప్తా, వైపీసీ ప్రసాద్, కొసరాజు బాపయ్య చౌదరి, జిల్లా వైస్‌గవర్నర్2 శ్రీనివాసరెడ్డి, చక్రధర్, రామకృష్ణప్రసాద్, ఆర్‌సీ కిషోర్, పాల్గొన్నారు.


స్కాలర్‌షిప్‌ను పంపిణీ చేస్తున్న సతీష్ కుమార్

వడ్డెర రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

గుడివాడ, జులై 21(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఈ నెల 27,28 తేదీల్లో నిర్వహించనున్న వడ్డెర వృత్తిదారుల ప్రథమ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కన్వీనర్ చంద్రగిరి నాగమల్లేశ్వరరావు కోరారు. సోమవారం పట్టణంలో పలుచోట్ల రాష్ట్రమహాసభల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం వడ్డెర కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో నిధులను కేటాయించాలన్నారు. సబ్సిడీతో రుణసౌకర్యం కల్పించాలని, ఆదరణ పథకం అమలు చేయాలని కోరారు. సామాజిక రక్షణ చట్టం రూపొందించాలని, వడ్డెరల అభివృద్ధి,సంక్షేమ దిశగా ప్రభుత్వాలు పనిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఉప్పతల ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు రేపాని కొండ, సహాయ కార్యదర్శి తమ్మిశెట్టి నాగ, బండి శ్రీను, చల్లా తిరుపతయ్య, చల్లా రాంబాబు, తమ్మిశెట్టి దుర్గారావు, బత్తుల సందీప్,చల్లా చిన్నారావు, తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ ప్యానల్ బాక్సులు చోరీ

కూచిపూడి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మొవ్వ పాలెంలో విద్యుత్ మోటార్ ప్యానల్ బాక్సులు చోరీకి గురైన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. చలమలశెట్టి వెంకట్రామయ్యకు చెందిన పొలంలో ఈ చోరీ జరగటంతో బాధిత రైతు కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఈ ప్రాంతంలో పలు సార్లు మోటార్లు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు రైతులు వాపోయారు. ప్యానల్ బాక్సుల అపహరణపై ఎస్సై కె.ఎన్ .విశ్వనాథ్‌ను వివరణ కోరగా, దీనిపై రైతుల నుంచి ఫిర్యాదు అందిందని, విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా స్థాయి షటిల్, చెస్ పోటీలు 25 నుంచి

గుడివాడ, జులై 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 25న కఠారి శ్రీనివాసరావు మెమోరియల్ గుడివాడ ఆల్ స్కూల్స్ చెస్ పోటీలు, జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక స్టేడియం కమిటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెస్ పోటీల్లో గుడివాడలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పాల్గొనాలని కోరారు. పోటీల్లో పాల్గొనే వారు సింగిల్స్‌కు రూ.300లు, డబుల్స్‌కు రూ.500లు ఎంట్రీ ఫీజుగా చెల్లించి ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 24వతేదీ సాయంత్రం 5గంటల లోపు కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

గుడ్లవల్లేరు : రెండవ అన్నవరంగా ఖ్యాతిగాంచిన గుడ్లవల్లేరు రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయాన్ని విశ్వహిందూపరిషత్ జాతీయ ట్రస్టీ డాక్టర్ పుట్టగుంట వెంకట సతీష్‌కుమార్ దర్శించారు. ఆలయం ఆధునీకరిస్తున్న నేపథ్యంలో ఆయన ఆలయాన్ని, అభివృద్ధి పనులను పరిశీలించారు.

పేదరికం లేని సమాజమే పీ4 ధ్యేయం

- ఎంపీడీవో విమాదేవి


పెదపారుపూడిలో..

పెదపారుపూడి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ నిర్మాణమే పీ4 లక్ష్యం అని, దాతల చేయూత అవసరార్థులకు కొండంత అండగా ఉంటుందని ఈ దిశగా అందరి ఆలోచనలు సాగాలని పెదపారుపూడి ఎంపీడీవో విమాదేవి అన్నారు. జీవో పావర్టీ పీ4 గ్రామసభలు సోమవారవం మండలంలోని భూషణగుళ్ల, గుర్విందగుంట, మహేశ్వరపురం, పాములపాడులలో నిర్వహించారు. తహసీల్దార్ శ్రీను నాయక్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, నియోజకవర్గ పీ4 సమన్వయకర్త సౌజన్య పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: మండలంలో పీ4 సర్వే విజయవంతం అవ్వటానికి అందరూ కలసి కృషి చేద్దామని ఎంపీడీవో బి.వై.విష్ణు ప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బందితో వివిధ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ4 సర్వే ప్రతి గ్రామంలో నిర్వహించి పేదవారు ఆర్థికంగా ఎదగటానికి దాతలను గుర్తించి, వారిని ఒప్పించి పేదలకు మేలు చేయాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, కార్యదర్శులు, పాల్గొన్నారు.


పామర్రులో..


గుడివాడ రూరల్‌లో..

పామర్రు:రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పీ-4 పథకాన్ని గ్రామాల్లో విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. పెదమద్దాలి గ్రామంలో సోమవారం పీ-4 పథకంపై గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బి.శాంతకుమారి, పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	228
చికెన్ స్కిన్‌లెస్	238

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

పీఎం శ్రమయోగి పథకం నిధుల్లో కోతకు కారణం చెప్పాలి : ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి శ్రమయోగి మాన్‌ధన్ (పీఎంఎస్‌వైఎం) పథకం నిధుల్లో కోతకు గల కారణాలను వివరించాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి సోమవారం జరిగిన పార్లమెంటు సమావేశంలో ప్రశ్నించారు. ఈ పథకం కింద 2021-22లో రూ.324 కోట్లను కేటాయించారని, 2024-25లో రూ.137కోట్లకు తగ్గించడానికి గల కారణాలను తెలియజేయాలని ఆయన కోరారు. కేంద్ర కార్మిక మంత్రి శోభకరందజాలే లిఖితపూర్వకంగా ఈ ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఈ పథకంలో 60 సంవత్సరాలు దాటిన అసంఘటిత కార్మికులకు నెలకు రూ.3 వేల చొప్పున పింఛన్ అందిస్తామన్నారు. నెలకు రూ.15 వేలలోపు ఆదాయం ఉన్న కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.


కిచెన్, డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న దాత ఎస్.జుమారావు

మేకా నరసింహారావు ఫౌండేషన్ రూ.15 లక్షల విరాళం

ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో కిచెన్, డైనింగ్ హాల్ పునర్నిర్మాణం

చల్లపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ హైస్కూల్‌లో పునర్నిర్మించిన కిచెన్, డైనింగ్ హాల్‌ను మేకా నరసింహారావు ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.జుమారావు సోమవారం ప్రారంభించారు. మేకావారిపాలెంకు చెందిన మేకా నరసింహారావు భార్య మేకా పాపమ్మ, కుమార్తె ఎస్.జుమారావు ఫౌండేషన్ ద్వారా సుమారు రూ.15 లక్షలు వెచ్చించి కిచెన్, డైనింగ్ హాల్‌ను పునర్నిర్మించారు. సోమవారం కిచెన్, డైనింగ్ హాల్‌ను దాత జుమారావు ప్రారంభించారు. సమాజాభివృద్ధిలో ఎన్టీఆర్ ట్రస్ట్ ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఎన్టీఆర్ స్కూల్స్ ద్వారా విద్య నేర్పటం, ఎన్నో సేవలు అందించటం స్ఫూర్తినిచ్చిందన్నారు. ఎన్టీఆర్ హైస్కూల్ అభివృద్ధికి సహకారం అందించటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జి.మధుసూదనరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వక్కపట్ల శ్రీనివాసరావు

నెలకుర్రు పీఏసీఎస్ అధ్యక్షుడిగా వక్కపట్ల శ్రీనివాసరావు

మచిలీపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నంమండలం నెలకుర్రు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా వక్కపట్ల శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా జద్దు గోగయ్య, గోపిశెట్టి వెంకట సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ 13 గ్రామాల పరిధిలోని రైతులు నెలకుర్రు పీఏసీఎస్‌లో సభ్యులుగా ఉన్నారని, వారందరికీ సకాలంలో పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి పీఏసీఎస్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. మంత్రి కొల్లు రవీంద్రకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. నెలకుర్రు సర్పంచ్ బొమ్మసాని వెంకటలక్ష్మి, గుండుపాలెం పీఏసీఎస్ చైర్‌పర్సన్ తూమాటి బసవశంకరావు, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.


హేమలతను సత్కరించి అభినందిస్తున్న ప్రత్యేక అధికారి పి.సాయిబాబు, ఎంపీడీవో ఎ.వి.రమణ

మార్గదర్శకురాలు హేమలతకు సత్కారం

చల్లపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 పథకంలో మార్గదర్శకురాలిగా పేరు నమోదు చేసుకుని నిరుపేద కుటుంబాన్ని దత్తత తీసుకున్న పారిశుధ్య కార్మికురాలు పల్లికొండ హేమలత ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.సాయిబాబు అన్నారు. పురిటిగడ్డ ప్రాథమిక పాఠశాల పారిశుధ్య కార్మికురాలు హేమలత చిర్ల కనికరమ్మను దత్తత తీసుకుని నిత్యావసర సరుకులు అందించిన విషయం తెలుసుకున్న అధికారులు హేమలతను సత్కరించారు. పురిటిగడ్డ పాఠశాలకు వచ్చిన ప్రత్యేకాధికారి సాయిబాబు, ఎంపీడీవో ఎ.వి.రమణ కార్మికురాలిని సత్కరించి నూతన వస్త్రాలను అందజేశారు. సర్పంచ్ మాతంగి రమ్య, ఎమ్మీవో పి.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు రాజులపాటి అంకమ్మ, ఈవో శైలజ, ఉపాధ్యాయులు దేవరపల్లి సురేష్‌బాబు, బి.నాగలక్ష్మి, గ్రామ ప్రముఖులు నాదెళ్ల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టాభి స్మారక భవనానికి కౌన్సిల్ అనుమతులు మంజూరు చేయాలి



మచిలీపట్నం టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి తక్షణమే కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి అనుమతులు మంజూరు చేయాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూనియన్ బ్యాంక్ భవన నిర్మాణానికి రూ.40 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా, అనుమతి ఇవ్వకుండా కాలయాపన చేయడం సమంజసం కాదని బాలాజీ అన్నారు. రాజకీయాలకు అతీతంగా తీర్మానాన్ని తక్షణమే ఆమోదించి అనుమతులు మంజూరు చేయాలని బాలాజీ డిమాండ్ చేశారు. నోబుల్ హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, న్యాయవాది మద్దాల సువర్ణరాజు, న్యాయవాది కమ్మిలి విజయకుమార్, సామాజిక కార్యకర్త మల్లంపల్లి వీరాంజనేయులు బాబు మాట్లాడారు.


కవిపురంలో పీఏసీఎస్ అధ్యక్షులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాగిత

పీఏసీఎస్ పాలకవర్గాలకు ఎమ్మెల్యే కాగిత అభినందన

పెడన రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : నందమూరు, కొంకేపూడి, కవిపురం గ్రామాల వ్యవసాయ సహకార పరపతి సంఘాల నూతన పాలక వర్గం ప్రమాణస్వీకారం చేయగా, వారిని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అభినందించారు. నందమూరుకు మన్నే శ్రీనివాసరావు, కొంకేపూడికి కట్టా నాగరాజు, కవిపురానికి షట్టి శ్రీనివాసరావు చైర్‌పర్సన్‌లుగా, సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. రైతుల ప్రయోజనాలు గుర్తించి పనిచేయాలను పాలక వర్గాలకు సూచించారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి వీర ప్రసాద్, శీరం ప్రసాద్, సర్పంచి పుప్పాల స్వరూపరాణి, శ్రీరామమూర్తి, నాయకులు పాల్గొన్నారు.


మాజేరు వద్ద గుర్రపుడెక్క తొలగింపు పనులు పరిశీలిస్తున్న తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, యువనేత మండలి వెంకట్రామ్


నాలుగో నెంబరు బ్రాంచి కాల్వలో స్వచ్ఛందంగా పూడికతీయిస్తున్న రైతులు


పంట బోదె పూడిక తీయించాలని కోరుతూ ఎంపీడీవో స్వర్ణభారతికి వినతిపత్రం అందజేస్తున్న కె.కొత్తపాలెం రైతులు

రైతులకు ఇబ్బంది లేకుండా డెక్క తొలగింపు

చల్లపల్లి, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గుర్రపుడెక్క తొలగింపు పనులు చేయిస్తున్నట్లు తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. చల్లపల్లి మండలం పుచ్చగడ్డలో చిల్లలవాగు మీడియం డ్రైనేజీ వంతెన, కొత్తమాజేరులో గుండేరు మేజర్ డ్రైనేజీ వంతెన, ఘంటసాల మండలం దేవరకోట సమీపంలో గుండేరు వంతెనల వద్ద గుర్రపుడెక్క పనులను ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనుల వివరాలను డ్రైనేజీశాఖ అధికారులు వివరించారు. పీసీ చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గుండేరు, చిల్లలవాగు వంతెనల వద్ద గుర్రపు డెక్క తొలగింపు పనులు రెండు రోజుల్లో పూర్తిచేస్తామన్నారు. ఎక్కడ సమస్య వచ్చినా తక్షణమే స్పందించి పరిష్కారం చేస్తున్నట్లు చెప్పారు. డ్రైనేజీ డీఈఈ జె.బాబూనాయక్ మాట్లాడుతూ, భారీ వర్షాలకు దేవరపల్లి మీడియం డ్రైనేజీ, భీమనది మేజర్ డ్రైనేజీ, ఏనుగుల కోడు మేజర్ డ్రైనేజీ, చిల్లలవాగు మీడియం డ్రైనేజీల నుంచి మురుగునీరు, గుర్రపుడెక్క పెద్దఎత్తున గుండేరు మేజర్ డ్రైనేజీలోకి చేరిన నేపథ్యంలో ఈ పనులు శరవేగంగా చేస్తున్నామన్నారు. ప్రధానంగా మాజరులో లింగన్నకోడు వంతెన వద్ద గుండేరులో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడంతో రెండు ఎక్స్‌కవేటర్లతో ముమ్మరంగా పనులు చేస్తున్నారన్నారు. కోతకు గురైన రహదారిని, వంతెన పటిష్ఠతను ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, పీసీ చైర్మన్, అధికారులు పరిశీలించారు. వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, క్వాలిటీ కంట్రోల్ డీఈ ఈ సిహెచ్.విశ్వకుమార్, ఏఈఈలు బి.ఇందిరా ప్రియదర్శిని, కె.అజయ్‌కుమార్, టి.విజయ్‌కుమార్, డ్రైనేజీ ఏఈ చిరంజీవి, డీసీ వైస్‌చైర్మన్ పరిశె చలపతిరావు, నేతలు బొర్రా అగ్గిరాముడు, బండి నాగార్జున, తుమ్మలగుంట గోపాలకృష్ణ, రైతునాయకులు వేమూరి రత్నగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా కాల్వపూడికతీత

ఘంటసాల : వర్షాలకు పొలాల్లో ఇటీవల వేసిన నాట్లు మునిగిపోయే ప్రమాదం ఉండటంతో రైతులు స్వచ్ఛందంగా యంత్రాన్ని ఏర్పాటు చేసుకుని వర్షపునీరు పారుదలయ్యేలా చర్య లు చేపట్టారు. మండల పరిధిలోని చిట్టూర్పు గ్రామంలోని దళితవాడ వద్ద నాల్గో నెంబరు బ్రాంచ్ కాలువ నుంచి జోడుగూడెం రోడ్డు వరకు పొలాల్లో ఇటీవల నాట్లు వేశారు. వర్షాలకు నీరు పొలాల్లోకి చేరుతున్న క్రమంలో రైతులు సొంతంగా సొమ్ము వేసుకుని వేసుకుని ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులు చేపట్టారు.

పంట బోదె పూడిక తీయించండి

మోపిదేవి : కెకొత్తపాలెం - పాగోలు వెళ్లే ఎనిమిదో నెంబర్ పంట కాలువ సమీపంలోని రాజా గారి భూములకు వెళ్లే పంటబోదె పూడికతీయించాలని కోరుతూ రైతులు మండల పరిషత్ కార్యాలయంలోని స్పందనలో ఎంపీడీవో స్వర్ణభారతికి వినతిపత్రం అందజేశారు. ఈ పంట బోదె కింద 200 ఎకరాలు సాగులో ఉన్నాయన్నారు.. సాగునీరు లేక నారుమడులు ఎండిపోతున్నాయని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే పంట బోదె పూడికతీయించాలని రైతులు కోరారు. రైతులు దుట్టా మోహన శివరాజయ్య, బుర్రె వెంకటేశ్వరరావు, చందన అనిల్, దుట్టా శేషుబాబు, మత్తి యానాదిరావు, మత్తి నాగేశ్వరరావు, ఆరుంబాక సుబ్బారావు, రామిశెట్టి వర్ధమాన్ తదితరులు పాల్గొన్నారు.

పెదతుమ్మిడి డ్రెయిన్ల పూడిక తీయించాలి

బంటుమిల్లి : పెదతుమ్మిడి అంతర్గత డ్రెయిన్లను పూడికతీయించాలని కోరుతూ బంటుమిల్లి తహసీల్దార్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం రైతులు అర్జీ ఇచ్చారు. గ్రామంలో పారిశుధ్య పనులు అధ్వానంగా ఉన్నాయని, వీధులలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం నెలకొందని తెలిపారు. ప్రాథమిక పాఠశాల సమీపాన చినతుమ్మిడి రోడ్డు మార్జిన్‌లో చికెన్ వ్యాపారులు, ఇతర వ్యాపారులు చెత్తను చెరువు గట్టు వద్ద పోస్తున్నారని తెలిపారు. వర్షాలకు దుర్గంధం వస్తోందని, అధికారులు స్పందించి పారిశుధ్య పనులపై దృష్టి పెట్టాలని గ్రామానికి చెందిన మురాల వెంకటేశ్వరరావు అర్జీ ఇచ్చారు.


చిట్టిగూడూరులో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత..బందరులో లోగిశెట్టి వెంకటస్వామి

సంక్షేమ ఫలాలు చేరేందుకే తొలి అడుగు

పెడన రూరల్, జూలై 21(ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలకు ప్రజలకు చేరేందుకే సుపరిపాలనలతో తొలి అడుగు కార్యక్రమం చేపట్టామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గురివిందగుంట, కవిపురం, కొంగంచర్ల గ్రామాల్లో ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి వీర ప్రసాద్, శీరం ప్రసాద్, సర్పంచి పుప్పాల స్వరూప రాణి, పుప్పాల శ్రీరామమూర్తి, పామర్తి వెంకటేశ్వరరావు, పుట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **గూడూరు** : ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం అమలు చేస్తోందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. చిట్టిగూడూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని సంక్షేమ పథకాలు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీసీ చైర్మన్, టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి, చిట్టిగూడూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు గోరిపర్తి చంద్రశేఖర్, చింతగుంట కృష్ణ, గోపీ నాగబాబు, ఎన్‌ఏ బేగ్, కోలపల్లి రజని, కాట్రగడ్డ రత్నబాబు, రాసంశెట్టి శివరావు, తోట వేణు, సమ్మెట ఈశ్వరరావు, డొక్కు ప్రసాద్, ఆలపాటి సత్యనారాయణ, కాట్రగడ్డ సత్యనారాయణ పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్** : సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా వివిధ డివిజన్లలో టీడీపీ నాయకులు విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మాజీ కౌన్సిలర్ బత్తిన దాసు దేవుడుచెరువు ఏరియాలో పర్యటించారు. సాతులూరి నాంచారయ్య, జగదీష్ పాల్గొన్నారు. 11వ డివిజన్‌లో టౌన్‌హాలు మాజీ అధ్యక్షుడు చిన్నం శివ పర్యటించారు. బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేశారు. 14వ డివిజన్‌లో టీడీపీ నగర అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి పర్యటించారు. అడపా రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు. ఎనిమిదో డివిజన్‌లో ముంతా రవీంద్రకుమార్, ముంతా నాగసుమన్, 33వ డివిజన్‌లో అసదుల్లా హుస్సేన్ (అమీర్), పోలాటితిప్పలో సర్పంచ్ మోకా రాజు తదితరులు ఇంటింటికి పర్యటించి ప్రభుత్వ పథకాలు వివరించారు. మూడో డివిజన్‌లో పద్మనాభుని శేఖర్ ఇంటింటికి పర్యటించి సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. **అవనిగడ్డ రూరల్** : గ్రామాల సమగ్రాభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని సీనియర్ టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పాత ఎడ్లంక గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివ రించారు. మునిపల్లి వెంకటేశ్వరరావు కాలును తొలగించగా, బొబ్బా గోవర్ధన్ రూ.5 వేలు ఆర్థిక సాయమందించారు. సర్పంచ్ పాలేపు సామ్రాజ్యం, మండల ప్రోగ్రామ్ చైర్మన్ కర్రా సుధాకర్, నేతలు పరుచూరి దుర్గాప్రసాద్, బండే రాఘవ, మండలి రామ్మోహనరావు, మేడికొండ విజ య్, బచ్చు హనుమాన్, కొల్లూరి వాసు, పాలేపు వెంకటేశ్వరరావు, మైల హరిబాబు, మోదుమూడి మాధవరావు, మునిపల్లి రాజేంద్ర ప్రసాద్, పాలేపు ఉపకులు, మునిపల్లి సుబ్రహ్మణ్యం, కొల్లూరి ఇమ్మానియేలు పాల్గొన్నారు. **కోడూరు** : ప్రభుత్వం అం దిస్తున్న సంక్షేమం, అభివృద్ధితో ప్రజలు సంతోషంగా ఉన్నా, జగన్మోహన్ రెడ్డి చేసిన పాపాలు ప్రజల పాలిట శాపాలుగా మారాయని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం హరిపురంలో నిర్వహించారు. టీడీపీ నాయకులు బొలిశెట్టి విఠల్‌రావు, తాతా పోతురాజు, పిల్లి మల్లికార్జునరావు, మహమ్మద్ ఇమ్రాన్, బొడ్డు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న బొబ్బా గోవర్ధన్


హరిపురంలో పర్యటిస్తున్న బండే శ్రీనివాసరావు


రంగనాయకస్వామి ఆలయంలో ఆషాఢ సారె సమర్పిస్తున్న భక్తులు


పెడన పైడమ్మకు ఆషాఢ సారె సమర్పిస్తున్న మహిళలు

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ

మచిలీపట్నం టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రాబర్ట్సన్‌పేటలోని రంగనాయకస్వామి దేవాలయంలో సోమవారం అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. **పెడన** : వందలాది మంది మహిళలు గ్రామదేవత పైడమ్మ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. దేవాంగ, శిష్టకర్ల, గౌడ, ముది రాజ్ సామాజిక వర్గాలకు చెందిన మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి కొత్తపేటలోని పైడమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని అక్కడ అమ్మవారికి సారె సమర్పించారు. మహిళలకు ఆలయ ఆశాది తోట రామారావు ప్రసాదాలు పంపిణీ చేసి సామూహిక ఆశీర్వచనం అందజేశారు. **నాగాయలంక** : భావదేవరపల్లిలోని అద్దంకి వారి వాడలో విజయ కోదండ రామాలయంలోని సీతమ్మ వారికి భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి సోమవారం ఆషాఢ సారెను సమర్పించారు. భక్తులు, గ్రామస్థులు విరివిగా పాల్గొన్నారు.

నేటి తరానికి ఆదర్శం మైనేని హరిప్రసాదరావు

● టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్

అవనిగడ్డ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి వసతులు లేని ఎడ్లంకలో పుట్టి దేశం గర్వించదగ్గ అణుశాస్త్రవేత్తగా ఖ్యాతి గడించి పద్మశ్రీ పురస్కారం అందుకున్న మైనేని హరిప్రసాదరావు నేటితరానికి ఆదర్శప్రాయులని టీడీపీ సీనియర్ నేత బొబ్బా గోవర్ధన్ అన్నారు. పాత ఎడ్లంక గ్రామంలో మైనేని హరిప్రసాదరావు జయంతిని సోమవారం నిర్వహించారు. మైనేని హరిప్రసాద్ చిత్రపటానికి దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావుతో కలిసి గోవర్ధన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఎడ్లంక గ్రామాభివృద్ధికి మైనేని హరిప్రసాద్ అందించిన సేవలను కొనియాడారు. దివి ప్రాంతంలో క్షిపణి పరీక్షా కేంద్రం నెలకొలడంలో హరిప్రసాదరావు కృషి ఎంతో ఉందన్నారు.

ఈ కార్యమంలో కర్రా సుధాకర్, పాలేపు సామ్రాజ్యం, పర్చూరి దుర్గా ప్రసాద్, బండే రాఘవ, మండలి రామ్మోహనరావు, మేడికొండ విజయ్, బచ్చు హనుమాన్, కొల్లూరి వాసు, పాలేపు వెంకటేశ్వరరావు, మైల హరిబాబు, మోదుమూడి మాధవరావు, మునిపల్లి రాజేంద్ర ప్రసాద్, పాలేపు ఉపకులు, మునిపల్లి లాజర్, తూమాటి ప్రసాద్, కమ్మిలి సుబ్రహ్మణ్యం, ఇమ్మానియేలు పాల్గొన్నారు. అవనిగడ్డలో యాసం చిట్టిబాబు నేతృత్వంలో మైనేని హరి ప్రసాదరావుకు నివాళులర్పించారు.


కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహిస్తున్న కొత్తపూడి గ్రామ మహిళలు

మా భూములు 22ఏ నుంచి మినహాయించండి

● కొత్తపూడి మహిళల ఆందోళన

మచిలీపట్నం టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పొట్లపాలెం గ్రామపంచాయతీ శివారు కొత్తపూడి గ్రామపరిధిలోని భూములను 22 ఏ నుంచి మినహాయించాలని గ్రామానికి చెందిన మహిళలు నాగేశ్వరమ్మ తదితరులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద కొత్తపూడికి చెందిన మహిళలు, రైతులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గరికముక్కు మార్గరెట్ తదితరు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు మురళీకృష్ణకు జనసేన నాయకుల పరామర్శ

అవనిగడ్డ రూరల్ : కిడ్నీ వ్యాధితో కుమార్తె లాస్య మృతి చెందిన నేపథ్యంలో అవనిగడ్డలో నివాసముంటున్న టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గాజుల మురళీకృష్ణను జనసేన నాయకులు సిద్ధినేని అశోక్ నాయుడు, కమతం నరేష్ పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

పేదలను ధనవంతులు దత్తత తీసుకోవాలి : గోపు

మచిలీపట్నం టౌన్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పీ-4 కార్యక్రమంలో ధనికులు, ఎన్ఆర్ఐలు భాగస్వాములై పేదలను దత్తత తీసుకోవాలని తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ కోరారు. కానూరు గ్రామంలో సోమవారం పీ-4 గ్రామసభ జరిగింది. మ సభలో వంద మంది పేదల పేర్లను నమోదు చేశారు. జనసేన నాయకుడు దివి మహేష్, కార్యదర్శి వెంకటేశ్వరరావు, బొమ్మిడి ఏడుకొండలు, పీతా రాము, బోలిశెట్టి నాని, మోకా రాజు, బొట్ల రాజేష్, గమిడి ఇమానియేల్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సౌజన్య కిరణ్మయి

కోడూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : కోడూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ జలగం సౌజన్య కిరణ్మయి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను సోమవారం ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు.

మంత్రి దృష్టికి ఆసుపత్రి అభివృద్ధి ప్రతిపాదనలు

అవనిగడ్డ రూరల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి ప్రతిపాదనలు మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లినట్లు కమిటీ డైరెక్టర్ తుంగల వెంకటగిరి సోమవారం తెలిపారు.